www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 15   సంచిక : 139   శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026 ,   పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## రాబోయే పదిన్నరేళ్ల పాటు
# నేనే సీఎం



● 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు ● అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ● నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది ● ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా ● నా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ అనేది లేదు ● కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు సీబీఐకి... ● నిబంధనల ప్రకారమే సింగరేణి టెండర్లు ● ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 :** 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం తన ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్ నగరాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టునకు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తానని తెలిపారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మొత్తగా ఉన్నానని తనను మాత్రమే ఆయన ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు."2029 మిగతా2లో...

# భారత్ బంద్ సక్సెస్..

● వివిధ రాష్ట్రాల్లో బ్యాంకింగ్, రవాణా సేవలకు అంతరాయం
● కేంద్ర విధానాలపై కార్మిక, రైతు సంఘాల నిరసన



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరే కంగా 10 కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె కారణంగా గురువారం వివిధ రాష్ట్రాల్లో సామాన్య జనజీవనానికి అంతరా యం ఏర్పడింది. రవాణా, బ్యాంకింగ్‌తో పాటు ప్రభుత్వ సేవలకు అవరోధం ఏర్పడింది. మిగతా2లో...

## పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల
### - ఫలించిన మంత్రి సీతక్క వినతి



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్రం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు మిగతా2లో...

## సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి మిగతా2లో...

## చంద్రబాబు, లోకేశ్‌ను
# కలిసిన బండ్ల గణేశ్



**అమరావతి,ఫిబ్రవరి 12 :** సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మిగతా2లో...

## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది
# గులాబీ జెండాయే

### శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని మిగతా2లో...

## నాపై కేసులు పెట్టినా
# వెనక్కి తగ్గను

ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయి
ఆ ట్రేడ్ డీల్ వల్ల దేశ రైతులు నష్టపోతారు
రైతుల రక్తాన్ని ట్రంప్‌నకు మోదీ అమ్మేశారు
నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేసిన రాహుల్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12 :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. తనపై కేసులు పెట్టినా, ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేసినా తాను పట్టించుకోనని అన్నారు. తాను దేశ రైతుల కోసం పోరాడుతానని తెలిపారు. అలాగే భారత్– అమెరికా మిగతా2లో...

## నేడే మున్సి'పోల్' ఎన్నికల
# ఫలితాలు

ఎవరికి ఎన్ని స్థానాలు
ఫలితాలపై అభ్యర్థులలో ఉత్కంఠ
ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు
ఎక్కడా తగ్గకుండా పెద్ద ఎత్తున ప్రచారాలు
నేడే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఈసీ
ఉదయం 8 గంటల నుంచి జరగనున్న లెక్కింపు




వివరాలు 2లో

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు
# ప్రారంభించండి

● తెలంగాణ ఎయిర్‌పోర్టులకు అనుమతులు ఇవ్వండి
● కేంద్రమంత్రి రామ్మోహన్‌కు సిఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12 :** వరం గల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్ పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమ తులు, సహాయం కోరారు. భేటీలో మామూ నూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలా బాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మిగతా2లో...

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

● ఉద్యమకారులకు అన్యాయం జరిగింది ● ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు ● అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది ● కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి ● తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమ కారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ మిగతా2లో...

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# రాబోయే పదిన్నరేళ్ల పాటు నేనే సీఎం

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రమంత్రికి ఇచ్చాము. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500–700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని తెలిపారు. తన ప్రభుత్వంలో నూటికి నూరు శాతం ఫోన్‌ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం తనకు అవసరం లేదని వివరించారు. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖరాసి 6 నెలవుతుందని, కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. "కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు" అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నిప్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిందని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో మనను కొట్టించారో వారు సార్ పక్కనే చేరిండ్రు.. కేశవరావు జాదవ్ చనిపోతే ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయా.. జయశంకర్ బొమ్మ కేబీఆర్ పార్కు వద్ద పెట్టాలని నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ను పదే పదే అడిగిన.. సుప్రీంకోర్టు తీర్పు అడ్డొచ్చింది.. ట్యాంకు బండ్ మీద పెడతామన్న పెట్టుకోలేక పోయినం.. అక్కడున్న ఆంధ్రోళ్ల విగ్రహాలు తీస్తరని అనుకున్నం... తీయకపోతివి.. కనీసం మనోళ్ల విగ్రహాలైన పేట్టకపోతివి.. ఆ బాధ వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడొచ్చినైన ఎవరి బొమ్మలు పెడుతుండో అర్థం కాని పరిస్థితి ఉంది. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ను పట్టుకొని తిరిగిన రేవంత్ రెడ్డిని గెలిపించుకున్నం.. ఆయనకు ఏం సోయి ఉంటది తెలంగాణ అంటే. రవీంద్ర భారతిలో గద్దర్, బిరదరాజు రామరాజు, సుద్దాల విగ్రహాలు ఉండాల్సింది... ఎవరి విగ్రహాలున్నాయి. చేతులో ఉన్నప్పుడు చేసుకోలేదు. ఇప్పుడు మన చేతులో పోరాటం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు పోరాడితేనే ఉద్యమ కారులకు న్యాయం జరుగుతుంది.' అని కవిత అన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన బండ్ల గణేశ్

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ గురువారం రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా, ఇటీవల తాను పూర్తి చేసిన 'సంకల్ప పాదయాత్ర' గురించి మంత్రికి బండ్ల గణేశ్ వివరంగా తెలిపారు. షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు 535 కిలోమీటర్ల పాటు 23 రోజుల పాటు సాగిన తన పాదయాత్ర అనుభవాలను, దాని వెనుక ఉన్న ఉద్దేశాన్ని లోకేశ్‌తో పంచుకున్నారు. అనంతరం, శ్రీవారి దర్శనం తర్వాత స్వీకరించిన తీర్థ ప్రసాదాన్ని లోకేశ్‌కు అందజేశారు. ఇరువురు నేతలు పలు అంశాలపై హృద్యంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. అంతకుముందు బండ్ల గణేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిశారు. ఏపీ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని తాను మొక్కుకున్న మొక్కును తీర్చుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టానని బండ్ల గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను ఆత్మీయంగా పలకరించి, పాదయాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. బండ్ల గణేశ్ అందించిన తిరుమల ప్రసాదాన్ని స్వీకరించారు.

# నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

(మొదటి పేజీ తరువాయి)

ట్రేడ్ ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని, రైతులను అమ్మేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మోదీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో తాను మాట్లాడిన ఓ వీడియోను రాహుల్ పోస్టు చేశారు.రైతుల జీవనోపాధిని హరించే లేదా దేశ ఆహార భద్రతను బలహీనపరిచే ఏ వాణిజ్య ఒప్పందం అయినా అన్నదాతలకు వ్యతిరేకమే. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఆహార సరఫరాదారుల ప్రయోజనాలపై రాజీ పడనివ్వం. నిన్న(బుధవారం) నేను పార్లమెంటులో నిజం మాట్లాడాను. మీకు (ప్రభుత్వానికి) నచ్చకపోతే అది వేరే విషయం. దేశం సత్యాన్ని అర్థం చేసుకోగలదు. నేను రైతులపక్షాన నిలబడతాను. అస్సలు వెనక్కి తగ్గను. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ, నేను రైతులకు అండగా ఉంటాం. వారిని అన్యాయం జరగనివ్వమని అన్నారు. రైతులే దేశానికి పునాది అని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని పత్తి, సోయాబీన్స్, యాపిల్, పండ్ల రైతులను అమ్మేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా విదేశీయులు దేశ వ్యవసాయ మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నరేంద్ర మోదీ ఈ ట్రేడ్ డీల్ ద్వారా ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. ఇది నిజమని, ఈ విషయం మోదీకి కూడా తెలుసని విమర్శించారు. మోదీ తన మిత్రులైన అదానీ, అంబానీ, విదేశీ శక్తుల కోసం మొత్తం దేశ వ్యవసాయ మార్కెట్‌కు తలుపులు తెరుస్తారని ఆరోపించారు. మోదీ రైతు వ్యతిరేకి అని ఈ విషయం యావత్ దేశానికి, అన్నదాతలకు తెలుసని పేర్కొన్నారు.విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ ద్వారాలు తెరవడం దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధిపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్ అభివర్ణించారు. పత్తి, సోయాబీన్స్, జొన్నలు, పండ్ల రైతులు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారన్నారు. దేశంలోని 99.5 శాతం మంది పేద, సన్నకారు రైతులే ఉన్నారని వెల్లడించారు. వారు పండించే పంటలకు మద్దతు ధర ఉండదని, సబ్సిడీలు కూడా అందవని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అమెరికాలో వ్యవసాయం యంత్రాలను ఉపయోగించి చేస్తారని, వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను అందిస్తుందన్నారు.

# నేడే మున్సి'పోల్' ఎన్నికల ఫలితాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :**

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు నేడు వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132 ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు.ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది.చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి మున్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు. 46 మున్సిపాలిటీల్లో 80 శాతం, 51 మున్సిపాలిటీల్లో 70 శాతం, 15 మున్సిపాలిటీల్లో 60 శాతం దాటింది.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లోని 2 వేల 582 వార్డుల్లో 13 లక్షల 61 వేల 285 మంది పురుషులు, 14 లక్షల 42 వేల 751 మంది మహిళలు, 238 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఏడు కార్పొరేషన్లలో 4 లక్షల 90 వేల 544 మంది పురుషులు, 5 లక్షల 14 వేల 475 మంది మహిళలు, 113 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీ రాణికుముదిని, సీడీఎంఏ కార్యాలయంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టీకే శ్రీదేవి నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో అవసరమైన విషయాలను ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయిందని ఊపిరి పీల్చుకున్న రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు తమకు ఎన్ని ఓట్లు పడ్డాయోనని అంచనా వేసుకుంటున్నారు.

# భారత్ బంద్ సక్సెస్..

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని నిరసనకారులు డిమాండు చేశారు. ఈ చట్టాలు కార్మికుల హక్కులను బలహీనపరిచాయని, ఉద్యోగ భద్రతను తగ్గించాయని, ఉద్యోగ నియామకాలు, ఉద్వాసనలను యాజమాన్యాలకు సులభతరం చేశాయని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.ఎంజీనరేగాను పునరుద్ధరించాలని, వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్(గ్రామీణ్)ని రద్దు చేయాలని కూడా నిరసనకారులు డిమాండు చేశారు. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్తు సవరణ బిల్లు, అణు ఇంధనానికి సంబంధించిన శాంతి చట్టాన్ని రద్దు చేయాలని కూడా కార్మిక సంఘాలు డిమాండు చేశాయి.

అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఒడిశా, బీహార్‌లో సమ్మె విజయవంతమైనట్లు తమకు సమాచారం అందిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ గురువారం తెలిపారు. బ్యాంకింగ్, బీమా, పోస్టల్, రవాణా, ఆరోగ్య, బొగ్గు, బొగ్గేతర గనులు, గ్యాస్ పైప్‌లైన్, విద్యుత్తు రంగాల్లో సమ్మె ప్రభావం ఉందని ఆమె చెప్పారు. సమ్మె కారణంగా భువనేశ్వర్, కటక్, రూర్కెలా వంటి నగరాల్లో రవాణా సర్వీసులు నిలిచిపోయాయి.

# మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి

(మొదటి పేజీ తరువాయి)

మామూనూరు విమానా శ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించి నందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# ఎన్ని కార్పొరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

(మొదటి పేజీ తరువాయి)

నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

**● నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :**

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# భారీ సెల్లార్ తో ఒక భవనం..

## రంగులు వేసుకుని గృహప్రవేశానికి రెడీగా మరో భవనం. భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది..?





**జూబ్లీహిల్స్ : ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)**
యూసఫ్‌గూడ సర్కిల్--38లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడే పరిస్థితులు ఇప్పట్లో కనిపించడం లేదు.ముందస్తుగా అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టి కట్టడి చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులకి మించి అక్రమ నిర్మాణాలు చేపట్టి రంగులు వేసుకొని గృహప్రవేశాలు చేసే వరకు అధికారులకు వారి విధులు గుర్తుకు రావడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.
అధికారుల నిర్లక్ష్యంతోనే అనుమతులు లేకుండా భవనాలు వెలుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివలన ఒకవైపు ప్రభుత్వ ఖజానాకు భారీ గండి పడటంతో పాటుదీంతో నగర అభివృద్ధి నియమావళి అమలు ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మధురానగర్ ప్లాట్ నెంబర్ +-41 ఓ నిర్మాణదారుడు అనుమతులకు మించి నిర్మాణం చేపట్టారు. కానీ సదరు టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సెట్బ్యాక్ నిబంధనలు పాటించకపోవడం, పార్కింగ్ స్థలాలను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించడం వంటి ఉల్లంఘనలు సర్వసాధారణంగా అయిపోయాయి.
టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, చర్యలలో ఆలస్యం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మౌలిక వసతులపై అదనపు భారం, భద్రతా ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి అనుమతుల్లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**శ్రీనివాస నగర్ భారీ సెల్లార్..**
శ్రీనివాస నగర్ వెస్ట్ ప్రాంతంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఎదురుగా అక్రమ నిర్మాణం యదేచ్ఛగా కొనసాగుతుంది. నిర్మాణదారుడు ఓ భారీ సెల్లార్ నిర్మాణం చేసి దానిని కనిపించకుండా కవర్ చేశారు. ఇటీవల కాలంలో సెల్లార్ నిర్మాణాల వలన జరిగిన ప్రమాదాలు కళ్ళముందే ఉన్నప్పటికీ అనుమతి లేకుండా సెల్లార్ ను నిర్మించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తు న్నాయి. బాధ్యత కలిగిన టౌన్ ప్లానింగ్ అధికారు లుగా అక్రమ నిర్మాణాన్ని కట్టడి చేయాల్సిన వారు, కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం మరింత వివాదాస్పదంగా మారింది. ఐదు అంతస్తుల భవనం కింద భారీ సెల్లార్ ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం దానిపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు.



**నోటీసులు ఇస్తున్నాం.. అంతకుమించి ఏం చేయాలి.!**
అక్రమ నిర్మాణాలు వలన అనేక సమస్యలు ఎదురవుతాయని గుర్తించిన కొందరు స్థానిక ప్రజలు వాటిపై ఫిర్యాదు చేస్తే... పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ప్రజలు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని కట్టడి చేయడం అంటే తమ చేతుల్లో ఏమీ ఉండదని... కేవలం తాము నోటీసులు మాత్రమే ఇవ్వగలమని తేల్చి చెబుతున్నారు. అధికారులు అక్రమార్కులకు నోటీసులు ఇచ్చినప్పటికీ వారు మాత్రం యదేచ్ఛగా రెట్టింపైన వేగంతో నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్నారు. సదరు పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులే వారికి ఉచిత సలహాలు ఇస్తున్నట్లు స్పష్టం స్పష్టమవుతుంది. సర్కిల్లో పనిచేసే టౌన్ ప్లానింగ్ విభాగపు సిబ్బంది మాత్రం నిత్యం ప్రభుత్వ పనులతో బిజీగా ఉన్నట్లు నటిస్తూ... మరో వైపు అక్రమ నిర్మాణాలు దగ్గర పెద్ద ఎత్తున ముడుపులు ముడుతున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



## పరిశ్రమలు తరలింపులో

# ఇటుక బట్టీలు ఉండదా..?

## కాలుష్యం వెదజల్లుతున్నా.. పట్టించుకోరా..? అధికారులు





**కుత్బుల్లాపూర్ : ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)**

పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో కాలుష్యాన్ని విడుదల చేసే పరిశ్రమలను నగర పరిధి బయటకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఇటుక బట్టీల నిర్వాహకులు మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా యథేచ్ఛగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గండి మైసమ్మ దుండిగల్ రెవెన్యూ పరిధిలోని గాగిల్లాపూర్ సమీపంలోని కోతి నూరు చెరువులో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వలన స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతూ, అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము ధూళి వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంట, చర్మవ్యాధులతో బాధపడుతున్నారని వైద్యులు సూచిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిసర ప్రాంతాల జీవన నాణ్యత దెబ్బతింటోందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, సంబంధిత శాఖల నిర్లక్ష్యం కారణంగా అక్రమంగా బట్టీల నిర్వహణ కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వీడకపోవడం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. కాలుష్యాన్ని అరికట్టేందుకు అక్రమ ఇటుక బట్టీలను వెంటనే తరలించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్




చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా భావించి, తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.




**బట్టీల్లో మగ్గుతున్న బాల్యం..చదువుకు దూరం.**

గాగిల్లాపూర్ కోతినారు చెరువు సమీపంలో కొనసాగుతున్న ఇటుక బట్టిల్లో పనిచేస్తున్న కార్మికుల జీవితం దయనీయంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కఠిన శ్రమ చేసినప్పటికీ వారికి అందుతున్న వేతనాలు చాలీచాలని స్థాయిలోనే ఉండటంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య కార్మికులు అప్పుల బారిన పడుతూ ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటుక బట్టిల్లో పనిచేసే కార్మికుల పిల్లలు చదువుకు దూరమవడం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రులతో పాటు పనుల్లో నిమగ్నమవుతున్న చిన్నారులు పాఠశాలకు వెళ్లలేకపోతుండటంతో వారి భవిష్యత్తు చీకటిలో మగ్గుతోంది. బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదనంగా, బట్టిల పరిసరాల్లో ఆరోగ్య సమస్యలు కూడా కార్మికులను వెంటాడుతున్నాయి. దుమ్ము, పొగ కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం పరిస్థితిని మరింత విషమంగా మారుస్తోంది.ఇటుక బట్టిల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు, ఆరోగ్య రక్షణ, పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించాలని ప్రజాసంఘాలు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సంబంధిత శాఖలు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటేనే కార్మికుల జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని వారు అంటున్నారు.

## ఈ నెల 15వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా పాలంపేట రామప్పలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సీతక్క







**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)**అనంతరం రామప్ప ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనం చేసుకుని శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ అధికారులకు చెప్పారు మహా శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాలు,పార్కింగ్ స్థలం పరిశీలించి శివరాత్రి పండుగ నిర్వహణలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారుఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి గారు, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ రామప్ప ఆలయ కమిటీ నూతన చైర్మన్ వెంకటాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ,ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ,ఆయా గ్రామాల సర్పంచులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కోటగుళ్లు శివరాత్రి మహోత్సవాలకు కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం









**గణపురం ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్):**ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 15న మహా శివరాత్రి మహోత్సవాలకు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ లను కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆహ్వాన పత్రిక అందజేసారు.అదేవిధంగా భూపాల పల్లి డి.ఎస్.పి అవిరి నేని సంపత్ రావు, చిట్యాల సిఐ మల్లేష్ భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు.

## మేడారం మహాజాతర హుండీ లెక్కింపు పూర్తి

**828 హుండీలతో రూ.13.25 కోట్ల ఆదాయం -- విదేశీ కరెన్సీ, బంగారం, వెండి లభ్యం**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)**ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర హుండీ లెక్కింపు ప్రక్రియ బుధ వారంతో ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన లెక్కింపులో మొత్తం 828 హుండీలను తెరిచి నగదు, ఆభరణాలను లెక్కించారు.వారం రోజుల పాటు సుమారు 400 మంది సిబ్బంది దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.13,25,83,269 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీల్లో నగదుతో పాటు విదేశీ కరెన్సీ, రద్దు నోట్లు, బంగారం, వెండి ఆభరణాలు కూడా లభించాయి.గత మహాజాతరలో 540 హుండీల ద్వారా రూ.13.25 కోట్ల ఆదాయం నమోదవగా, ఈసారి 828 హుండీలు ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు సమాన స్థాయిలోనే ఆదాయం రావడం విశేషం. హుండీల సంఖ్య గణనీయంగా పెరిగినా ఆదాయం పెరుగుదల పరిమితంగానే ఉండటం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు.భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే మేడారం జాతరలో లక్షలాది మంది పాల్గొనగా, హుండీ ఆదాయం కూడా భారీ స్థాయిలో నమోదవడం దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడనుంది. లభించిన నగదు, ఆభరణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో జమ చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

## మచ్చాపూర్ పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ

**కార్యక్రమంలో పాల్గొని తల్లి ఆశీర్వాదాన్ని అందుకున్న మంత్రి సీతక్క**
**పోచమ్మ తల్లి గుడికి పది వేల రూపాయలు విరాళంగా అందించారు**
**అలాగే పోచమ్మ తల్లి దేవాలయం చుట్టూ ప్రహరి గోడ నిర్మిస్తానని, మంచి నీటి బోర్ వేయిస్తానని, దేవాలయానికి వెళ్ళే దారి సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు**
**అలాగే మచ్చాపూర్ గ్రామంలో ప్రధాన సమస్య భూదాన్ భూముల సమస్య అని, అట్టి సమస్యను త్వరలో పరిష్కరిస్తా అని మచ్చాపూర్ ప్రజలకు హామీ ఇచ్చారు..**







**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)** గోవిందరావుపేట మండల మచ్చాపూర్ గ్రామం నందు గ్రామ సర్పంచ్ జంపాల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగే పోచమ్మ తల్లి విగ్రహా విష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖా దనసరి అనసూయ సీతక్క విచ్చేసి తల్లి యొక్క ఆశీర్వాదం గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరారు ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పోచమ్మ తల్లి దేవాలయం చుట్టూ ప్రహరి గోడ నిర్మిస్తానని, తల్లిని దర్శించే భక్తుల కోసం మంచినీటి బోర్ వేయిస్తానని, గుడికి వెళ్ళే దారి సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పోచమ్మ తల్లి దేవాలయానికి పది వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. అలాగే మచ్చాపూర్ గ్రామంలో ప్రధాన సమస్య భూదాన్ సమస్య అని, ఆ సమస్య వల్ల గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తొందర్లోనే కలెక్టర్ గారితో మాట్లాడి భూదాన్ భూముల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ గార్లతో పాటుగా గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## అన్నదాతకు 'కాపర్' కష్టం: ములుగు జిల్లాలో రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లాలో సాగు భారమై, ప్రకృతి పగబట్టినా మొక్కవోని ధైర్యంతో సాగు చేస్తున్న రైతులకు ఇప్పుడు "కాపర్ వైర్ల దొంగలు" నిద్రలేకుండా చేస్తున్నారు. దొంగలు ముఠాలుగా ఏర్పడి, రాత్రికి రాత్రే ట్రాన్స్‌ఫార్మర్లను తుత్తునియలు చేస్తూ లోపల ఉండే విలువైన కాపర్ వైర్‌ను అపహరిస్తున్నారు.

నిర్వీర్యమవుతున్న రక్షణ వ్యవస్థ?

గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో ఈ దొంగతనాలు నిత్యకృత్యమయ్యాయి.గోవిందరావుపేట మండలంలో కేవలం ఆరు నెలల కాలంలోనే 8కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.తాడ్వాయి మండలంలో ఒకే రైతు దుర్గం రమణయ్య ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు దొంగిలించడం దొంగల తెగింపుకు నిదర్శనం.వరుస దొంగతనాలు జరుగుతున్నా ఇప్పటివరకు ఒక్క నిందితుడిని కూడా పట్టుకోకపోవడం పోలీసు యంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది.సాగు సంక్షోభంలో రైతు గతంలో కరెంట్ కోసం పొలాల గట్లపై పడుకున్న రైతులు, నేడు ట్రాన్స్‌ఫార్మర్లను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పొలాల వద్ద కాపలా కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం వల్ల కరెంట్ సరఫరా ఆగిపోయి, సమయానికి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. రైతులకు అదనపు భారంగా దొంగతనం జరిగిన ప్రతిసారీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం



నిరీక్షించడం, దరఖాస్తులు చేసుకోవడం రైతుకు అదనపు మానసిక వేదనకు గురి అవుతున్నాడు.ఇది ఒంటరిగా చేసే పని కాదు, పక్కా ప్రణాళికతో ముఠాలుగా ఏర్పడి చేస్తున్న దొంగతనం.తక్షణమే కావాల్సిన చర్యలు పోలీస్ శాఖ ఈ అంశాన్ని కేవలం ఒక దొంగతనంగా చూడకుండా, రైతు జీవనాధారంపై జరుగుతున్న దాడిగా పరిగణించాలనీ కోరుతున్నాం. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, గస్తీ పెంచాలి,పాత సామాన్ల దుకాణాలపై కాపర్ వైర్ కొనుగోలు చేసే వ్యాపారులను విచారిస్తే దొంగల మూలాలు బయటపడే అవకాశం ఉంది.పోలీసు అధికారులు రైతులతో కలిసి గ్రామాల్లో రాత్రి పూట నిఘా పెంచాలనీ కోరుతున్నాం.



సామాన్యుడు నమ్మేది పోలీసు వ్యవస్థనే. అకాల వర్షాలతో కుదేలైన రైతును, ఈ దొంగల బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ ముఠాలను ఆదిలోనే అరికట్టకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అయ్యే ప్రమాదం ఉంది.వెంటనే పోలీసు యంత్రాంగం స్పందించి ఈ కాపర్ వైర్ దొంగలను పట్టుకోవాలని కోరుతునం

## మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**ఆధ్యాత్మిక శోభతో రామప్ప ఆలయాన్ని సుందరీకరించాలి**
**భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.**
**మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన :: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**







**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (పీపుల్స్ న్యూస్)**రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం లో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడేలా ఆలయాన్ని సుందరీకరించాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వ దినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి,ఆర్డీఓ వెంకటేష్ ఆలయ ఈవో ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత: డిజిపి బి. శివధర్ రెడ్డి

**హైదారాబాద్:క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 12, పీపుల్స్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి జరుగుతున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డిజిపి పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు , క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని,వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షిస్తామని వివరించారు.లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని,పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఏదైనా అల్లర్లు




లేదా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో సంబంధిత చట్టాల ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు డిజిపి తెలిపారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తామని,జన సమూహాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని జిల్లా ఎస్పీలు మరియు పోలీస్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, పోలీసు అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ కౌంటింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు .బి ఎన్ ఎస్ ఎస్ 163 ప్రకారంగా....కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎక్కువ మంది గుమికూడటం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలపై నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని డిజిపి పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని డిజిపి శ్రీ బి. శివధర్ రెడ్డి సూచించారు.

# పీపుల్స్ న్యూస్ కథనంపై ప్రశంసల వెల్లువ

**వెంకటాపూర్‌లో పేకాట జూదంపై "పీపుల్స్ న్యూస్" పత్రిక ప్రచురించిన కథనం పట్ల గ్రామ ప్రజలు, విద్యావేత్తలు ప్రముఖులు అభినందనలు**


**వెంకటాపూర్ ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 ( పీపుల్స్ న్యూస్):** సమాజాన్ని కుళ్ళగొడుతున్న చీకటి వ్యసనాలను వెలుగులోకి తీసుకువచ్చినందుకు విలేకరిని ప్రశంసిస్తూ పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.విద్యావేత్త సాద రవిందర్ ఫోన్ కాల్ ద్వారా విలేకరిని సంప్రదించి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో యువతను తప్పుదోవ పట్టిస్తున్న పేకాట వంటి వ్యసనాలపై ధైర్యంగా కథనాలు రాయడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వార్తలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, చెడు అలవాట్లను తగ్గించేందుకు దోహదపడతాయని చెప్పారు.గ్రామ ప్రముఖులు కూడా స్పందిస్తూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న పత్రికా విలేకరుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.సమాజ శ్రేయస్సు కోసం మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరమని,భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సమస్యలపై కథనాలు వెలువడాలని ఆకాంక్షించారు.గ్రామాభివృద్ధి యువత భవిష్యత్తు దృష్ట్యా పేకాట వంటి వ్యసనాల నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

# కొలహాపూర్ మహాలక్ష్మి శక్తి పిటాన్ని దర్శించుకున్న కర్కనాగరాజు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12, (పీపుల్స్ న్యూస్ ) :** 18వ శక్తి పీఠాలలో ఒకటైన మహారాష్ట్ర కొలహాపూర్ లో ఉన్నటువంటి మహాలక్ష్మి మాతను గురువారం కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు, టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్కనాగరాజు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి ని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమం లో భాగంగా అమ్మవారి హారతి లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

# చలికాలంలో మహిళల్లో అధికంగా జుట్టు రాలడం వెనుక ఉన్న ప్రధాన కారణాలు ఇవే..!



జుట్టు రాలడం సహజమే అయినప్పటికీ శీతాకాలంలో ఈ జుట్టు రాలడం మరింత ఎక్కువగా ఉంటుందని మీకు తెలుసా.. అవును శీతాకాలంలో మహిళల్లో జుట్టు రాలడం సాధారణం కంటే మరింత ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కాలానుగుణంగా వచ్చే మార్పులతో పాటు జీవనశైలిలో వచ్చే మార్పుల కారణంగా ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. శీతాకాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. ఇది తల చర్మాన్ని పొడిగా మారుస్తుంది. దీంతో చర్మం బిగుతుగా, దురదగా అనిపిస్తుంది. తలచర్మం అనారోగ్యంగా ఉండడం వల్ల జుట్టు మూలాలు బలహీనంగా తయారవుతాయి. దీని వల్ల జుట్టు విరిగిపోవడం, జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది.రక్త ప్రసరణ ప్రభావం..అంతేకాకుండా చలికాలంలో రక్తప్రసరణ కూడా ప్రభావితం అవుతుంది. శరీరం ఇతర అవయవాలను వెచ్చగా ఉంచడానికి ప్రయత్నిస్తుంది. దీంతో తలకు రక్తప్రసరణ తగ్గుతుంది. జుట్టు కుదుళ్లకు రక్తం, ఆక్సిజన్, పోషకాల ప్రసరణ తగ్గడం వల్ల జుట్టు బలహీనంగా మారడంతో పాటు జుట్టు పెరుగుదల కూడా మందగిస్తుంది. వీటితో చలికాలంలో మనం అనుసరించే కొన్ని పద్ధతుల వల్ల కూడా జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. చలికాలంలో సహజంగానే మనం వేడి నీటితో స్నానం చేస్తాం. తలస్నానం వేడి నీటితో చేయడం వల్ల తలపై ఉండే సహజ నూనెలు తొలగిపోతాయి. అలాగే జుట్టును తరచుగా బ్లో డ్రై చేయడం వల్ల జుట్టు పొడిబారుతుంది. జుట్టు పొడిబారడం వల్ల జుట్టు ఎక్కువగా విరిగిపోతుంది.నీటిని తక్కువగా తాగడం..అదే విధంగా చలికాలంలో చాలా మంది నీటిని తక్కువగా తాగుతారు. దీంతో శరీరం నిర్జలీకరణానికి గురి అవుతుంది. ఇది జుట్టు బలాన్ని, మెరుపును తగ్గిస్తుంది. జుట్టు రాలడం అనేది కాలానుగుణంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. వేసవి ముగిసిన కొన్ని నెలల తరువాత జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఫలితంగా చలికాలంలో జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది. పొడి వాతావరణం, బలహీనమైన కుదుళ్లు, కాలం మారడం వల్ల జుట్టు రాలడం మరింత ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా చలికాలంలో కొందరు సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ కు గురి అవుతారు. దీంతో ఒత్తిడి పెరిగి జుట్టు ఎక్కువగా రాలుతుంది.హార్మోన్ మార్పులు.. అంతేకాకుండా మహిళల్లో వచ్చే హార్మోన్ మార్పులు, థైరాయిడ్ సమస్య, పీసీవోఎస్ వంటి సమస్యలతో బాధపడే వారిలో జుట్టు రాలడం మరింత ఎక్కువగా ఉంటుంది. అలాగే జుట్టును ఎక్కువగా కడగడం, కఠినమైన షాంపూలు వాడడం వల్ల కూడా జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. ఇలా అనేక కారణాల వల్ల చలికాలంలో మహిళల్లో జుట్టు ఎక్కువగా రాలిపోతుందని వైద్యులు చెబుతున్నారు. చలికాలంలో జుట్టు ఎక్కువగా రాలడం తాత్కాలికమే అయినప్పటికీ తల చర్మాన్ని సంరక్షించుకోవడం, శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం వల్ల చలికాలంలో జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# మోకాలినొప్పికి క్యాబేజీ ఆకుల ట్రీట్‌మెంట్.. పని చేస్తుందా?

ప్రస్తుతం చాలామంది మోకాలి నొప్పి సమస్య తో బాగా బాధపడుతున్నారు. మోకాళ్ళ నొప్పి సమస్యకు పరిష్కారంగా పిఆర్పి ఇంజక్షన్లను చేయించుకుంటున్నారు. మోకాళ్లలో కొల్లాజిన్ తగ్గిపోవడం వల్ల కీళ్ల మధ్య రాపిడి జరిగి లూబ్రికేట్ లేక మోకాలు నొప్పి వస్తుంది. కీళ్ల వద్ద వాపు రావడం, నడవలేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. ఇక ఈ సమస్యల పరిష్కారానికి వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పి ట్రీట్మెంట్ వర్కౌట్ అవుతుందా? అయితే మరికొందరు ఇంటి చిట్కాలను కూడా పాటిస్తున్నారు. మోకాలు నొప్పిని తగ్గించుకోవడానికి ప్రస్తుతం వైరల్ అవుతున్న ఇంటి చిట్కాలలో క్యాబేజీ ఆకులతో ప్యాక్ చేయడం ఒకటి. అసలు క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పి కోసం చేసే ట్రీట్మెంట్ వర్కౌట్ అవుతుందా? వైద్యులు ఏం చెప్తున్నారు? అనేది ఒకసారి తెలుసుకుందాం.క్యాబేజ్ ఆకులతో ప్యాక్ ఇలా మోకాలు నొప్పి కోసం చాలామంది ఇంట్లోనే క్యాబేజీ ఆకులతో మోకాలికి ప్యాక్ వేస్తున్నారు. క్యాబేజీ ఆకులను తీసి, వాటిని మెత్తబడేలా బాగా రుద్ది ఆ పైన మోకాలి పైన ఆకులు పెట్టి, కాటన్ క్లాత్ తో కానీ, బ్యాండేజ్ తో కానీ కట్టు కట్టాలి. కనీసం అరగంట నుంచి గంట పాటు, లేదా రాత్రంతా అలానే దానిని ఉంచాలి. మోకాలు వాపు తగ్గించే క్యాబేజీ ఆకులు రోజుకు ఒకసారి లేదా రెండుసార్లు ఇలా చేయడం వల్ల కొద్దిగా మోకాలు నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. క్యాబేజీ ఆకుల్లో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మోకాలు వాపు తగ్గించడంలోనూ, రక్త ప్రసరణ మెరుగుపరచటం లోను, మోకాలు స్టిఫ్నెస్ తగ్గించి, ఫ్రీగా నడవడానికి సహాయపడతాయి. అయితే క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పికి కలిగే ఉపశమనం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.మోకాలి నొప్పికి శాశ్వత పరిష్కారమేనా? అది మోకాలు నొప్పికి శాశ్వతమైన పరిష్కారం కాదు. కనుక ఆర్థరైటిస్ తో బాధపడేవారు నొప్పి కాస్త రిలీఫ్ కావాలంటే క్యాబేజీ ఆకులను ఉపయోగించవచ్చు కానీ, కచ్చితంగా వైద్యుని సంప్రదించ వలసిందే. ఇక కొంతమందికి క్యాబేజీ ఆకులతో అలర్జీ వచ్చే అవకాశం కూడా ఉంటుంది కాబట్టి, అటువంటి సమస్య ఉంటే క్యాబేజీ ఆకులతో కట్టుకట్టడం కూడా మంచిది కాదు

# ఘనంగా సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు








**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 12, (పీపుల్స్ న్యూస్) :** సైబరాబాద్ లో నిర్మించిన ప్రతీ కట్టడంలో, జరిగిన ప్రతి అభివృద్ధి పనుల్లో సైబరాబాద్ పోలీసుల సేవలు చిరస్థాయిగా, అజరామరంగా నిలిచిపోయాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబరాబాద్ మెట్రోపాలిటన్ చట్టం ప్రకారం 2003లో స్థాపించిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతానికి సేవలందిస్తున్న ప్రముఖ అర్బన్ పోలీసింగ్ వ్యవస్థగా నిలిచిందని గుర్తుచేశారు. నాటి తొలి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఎం. మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారని, ఈ 23 ఏళ్ల ప్రస్థానంలో ప్రాంత అభివృద్ధిలో పోలీసుల కష్టం, స్వేదం, త్యాగం కీలక పాత్ర పోషించాయన్నారు.జాతీయ పతాకం సాక్షిగా ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. సాంకేతికతను వినియోగిస్తూ ఆధునిక పోలీసింగ్‌లో సైబరాబాద్ కమిషనరేట్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సీపీ తెలిపారు. పునర్విభజనల నేపథ్యంలో, జనాభా, విస్తీర్ణం ఆధారంగా 'కోర్ అర్బన్ రీజన్'ని మూడు జోన్లుగా విభజించడం జరుగిందని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో సమన్వయం పెంచుతూ పోలీస్ స్టేషన్లు, డివిజన్లను మున్సిపల్ వార్డులు, సర్కిళ్లకు అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు.సైబరాబాద్ పోలీసులు టెక్నాలజీ ఆధారిత కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులు, ట్రాఫిక్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, పబ్లిక్ –ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయన్నారు. సైబరాబాద్ పోలీసుల ప్రొఫెషనల్ నైపుణ్యాలకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయన్నారు. సైబరాబాద్ ప్రాంతం దేశ జీడీపీకి గణనీయంగా తోడ్పడుతున్నదని, ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫార్మా, బయోటెక్నాలజీ, ఎంఎస్ఎంఈలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాల వృద్ధికి పోలీసులు కల్పించే భద్రతే పునాది అని సీపీ స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు భద్రతా వ్యవస్థ బలోపేతం అయ్యిందని, 23 ఏళ్ల ప్రగతి ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను ఆవిష్కరించినున్నట్లు తెలిపారు. అలాగే, సైబరాబాద్ ఇప్పటివరకు కమిషనరేట్‌లో సేవలందించిన మాజీ పోలీస్ కమిషనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రధాన సవాళుగా ఉన్నాయని సీపీ తెలిపారు. యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి, వ్యాపారం,పనుల కోసం వచ్చిన లక్షలాది మంది వలస కార్మికుల భద్రత, సంక్షేమం పోలీసుల బాధ్యత అని చెప్పారు. వారికి ఇన్సూరెన్స్, మెడికల్ కేర్ వంటి సదుపాయాలు నిబంధనల ప్రకారం అందించాల్సిందేనని, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సేవ, ప్రవర్తన ద్వారా ప్రజల విశ్వాసం గెలవాలని, 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్ర మాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు పోలీసులు తోడుగా ఉన్నారన్న భరోసా కల్పించాలని అన్నారు. సైబరాబాద్ లో ప్రత్యేక నేర విభాగాలు, సైబర్ ఎన్ ఫోర్స్ మెంట్ యూనిట్లు, ప్రజలతో భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా భద్రతను మరింతగా బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీపీ ఆఫీసు ప్రాంగణంలో సీపీ మొక్క నాటారు. అనంతరం ధీర, వీర, ధృవ, భీమ, రాఖీ, తేజ, మౌని, లైకా పోలీసు జాగిలాల గౌరవ వందనం సమర్పించాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఫార్మేషన్ డే సందర్భంగా నార్సింగి సైకిల్ ట్రాక్ పై ప్రజలతో కలిసి పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేశారు. సైబరాబాద్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో..సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయగా, రాయదుర్గం పోలీసులు మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. జీడిమెట్ల, మేడ్చల్ పరిధిలో పోలీసులు ఆసుపత్రులు, ఆశ్రమాలను సందర్శించి రోగులకు, మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై పలు అవగాహన కార్యక్రమాలు చేశారు. పోలీసింగ్‌తో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ మియాపూర్ మరియు రామచంద్రాపురం ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు, యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లకు గులాబీ పువ్వులు, చాక్లెట్లు ఇచ్చి అభినందించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇలా కమిషనరేట్ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం మరియు కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమాలతో 24వ ఆవిర్భావ దినోత్సవం ప్రజల మధ్య ఒక పండుగలా, ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, ట్రాఫిక్–1 డీసీపీ రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవంలో సీపీ డాక్టర్ ఎం. రమేష్**








**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 12, (పీపుల్స్ న్యూస్ ) :** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ సూచించారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సైబరాబాద్ పోలీసులు యువతతో కలిసి నార్సింగి సైకిల్ ట్రాక్ పై సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు యువకులతో సమావేశమై.. పోలీసులు శాఖ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, భద్రతా చర్యలు,సామాజిక బాధ్యతల తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగడం, ఇతరుల హక్కులను గౌరవించడం వంటి అంశాలపై యువతకు మార్గదర్శకత్వం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం యువతతో కలిసి సైక్లింగ్ నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ స్వయంగా పోలీస్ సిబ్బందితో కలిసి సైక్లింగ్ లో పాల్గొని నాయకత్వం వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిపి వెంట శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్, కూకట్ పల్లి డిసిపి రితిరాజ్, సి ఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి సంజీవ్, ఎస్బీ డీసీపీ సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డిసిపి సాయి మనోహర్, ఏడిసిపి లు, ఏసీపీలు, పోలీస్ సిబ్బంది, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మియాపూర్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 12, (పీపుల్స్ న్యూస్) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ ఎం. ఆదిమూర్తి తో పాటు మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్. విద్యాసాగర్ రెడ్డి, ఎస్ఐ గాల్వ రాములు, ఏఎస్ఐ మల్లయ్య, సిబ్బంది ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గుర్తించి ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా హెల్మెట్‌లు ధరించిన ద్విచక్ర వాహనదారులు, సరైన నంబర్ ప్లేట్లు, రియర్ వ్యూ మిర్రర్లు కలిగిన వాహనాలు, సీటుబెల్టులు వాడుతున్న వారిని పోలీసులు ఆపి అభినందించారు. అలాగే సరైన యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లను కూడా ప్రశంసించారు. ట్రాఫిక్ నియమాలను బాధ్యతాయుతంగా పాటిస్తున్న వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేసి ఏసీపీ అభినందనలు తెలిపారు. రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం, నియమాలను స్వచ్ఛందంగా పాటించే పౌరులను ప్రోత్సహించడం ద్వారా సురక్షిత రవాణా సంస్కృతిని పెంపొందించడం లక్ష్యమని ఏసీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ ట్రాఫిక్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.

# సముద్రం పక్కనే ఉన్నా తియ్యని నీరు ఎలా రామేశ్వరంలోని 22 తీర్థాల వెనక దాగిన రహస్యం ఇదే!



ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా భావిస్తారు. వాటిలో ప్రధాన తీర్థం "అగ్ని తీర్థం". అదే బంగాళా ఖాతం సముద్రం. శ్రీ రామేశ్వరుని దర్శించుకునే ముందు భక్తులు ముందుగా సముద్ర స్నానం చేయాలి. రెండవది రామేశ్వరానికి సమీపంలో ధనుష్కోటి మార్గంలో ఉన్న జటా తీర్థం. రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చి ఈ తీర్థంలో ముందుగా తన జటను తడుపుకుని ఆ తరువాత స్నానం చేశాడట. అందుకే ఈ తీర్థానికి 'జటా తీర్థం' అనే పేరు వచ్చింది. ఈ రెండు కాకుండా రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలో మరో 22 పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటి విశిష్టతను తెలుసుకుందాం.

22 తీర్థాల విశిష్టత

22 అనే సంఖ్య రాముని అమ్ములపొదిలో గల 22 బాణాలకు నిదర్శనమని అంటారు. మొదటిదైన అగ్ని తీర్థం అనే సముద్ర స్నానం చేయాలి అనంతరం అలాగే తడిబట్టలతో నడుచుకుంటూ ఆలయం లోపలకు ప్రవేశించి అక్కడ ఉన్న 22 పవిత్ర తీర్థాలలో స్నానం చేసిన తర్వాత మాత్రమే పరమేశ్వరుని దర్శించుకోవాలి. ఇది ఆలయ సంప్రదాయం. ఈ తీర్థాల పేర్లు, వాటి ప్రత్యేకతను తెలుసుకుందాం. జటా తీర్థంలో మన వీలును బట్టి ఎప్పుడైనా స్నానం చేయవచ్చు.

22 తీర్థాల వెనుక పురాణ గాథ

రామేశ్వరం ఆలయ ప్రాంగణంలో ఉన్న తీర్థాలుగా పిలవబడే 22 బావుల ఉద్భవించడం వెనుక ఉన్న పురాణ గాథ చూద్దాం. రామాయణంలో శ్రీరాముడు రావణ సంహారం చేసిన అనంతరం రామేశ్వరంలో శివలింగ ప్రతిష్ట చేసి పూజించాడు. అయితే శివపూజ కోసం దివ్యతీర్థాలు కావాలి. రాముని భక్తి చూసిన సముద్ర దేవుడు ఒకే రాత్రిలో 22 పవిత్ర తీర్థాలు ఉద్భవింపజేశాడు. సముద్రానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ ఈ బావుల్లోని నీరు తియ్యగా ఉండడం ఈ తీర్థాల మహత్యాన్ని చాటుతుంది. అంతేకాదు ప్రతి బావిలోని నీరు రుచి, ఉష్ణత, గుణం వేరుగా ఉండటం వాటి ప్రత్యేకత! ఈ బావుల్లో ఒక్కో బావిలో స్నానం చేస్తే ఒక్కో ఫలితం 22 తీర్థాల పేర్లు, వాటి ప్రత్యేకత

1. మహాలక్ష్మీ తీర్థం!
మహాలక్ష్మి తీర్థంలో స్నానం చేస్తే ధన సంపదలు, ఐశ్వర్యం సిద్ధిస్తుంది. మనసు శుద్ధి అవుతుంది. దారిద్ర నివారించబడుతుంది.

2. సావిత్రీ తీర్థం!
సావిత్రీ తీర్థంలో స్నానం చేస్తే వాక్పటిమ, విద్య, మానసిక శక్తి, ప్రవచన శక్తి, గానం, వేదాధ్యయనం లో పురోగతి కలుగుతుంది.

3 .గాయత్రి తీర్థం!
గాయత్రీ తీర్థంలో స్నానం చేయడం వలన పాపక్షయం కలుగుతుంది. జపసిద్ధి, మానసిక ప్రశాంతత కలుగుతాయి.

4. సరస్వతి తీర్థం!
సరస్వతీ తీర్థంలో స్నానం చేస్తే మంచి విద్య, కళలలో అభివృద్ధి, వాక్శుద్ధి కలుగుతుంది. ఆర్జించిన జ్ఞానం పవిత్రమవుతుంది.

5. సేతు మాధవ తీర్థం!
ఈ తీర్థం రామసేతు వైభవానికి సూచకం. ఈ తీర్థంలో స్నానం చేస్తే కుటుంబ సమైక్యత, శుభకార్య సిద్ధి కలుగుతాయి.

6. గంధమాధన తీర్థం!
గంధమాధన తీర్థంలో స్నానం చేస్తే దేహం పవిత్రమవుతుంది. శారీరక రోగాలు తొలగుతాయి. మానసిక శాంతి లభిస్తుంది.

7. గవాక్ష తీర్థం!
గవాక్ష తీర్థంలో స్నానం చేస్తే సకల గ్రహ దోషాలు నివారణ అవుతాయి. శివదర్శనం సులభం అవుతుంది.

8. నల తీర్థం!
నల తీర్థంలో స్నాన చేస్తే శని బాధలు తొలగుతాయి. నల మహారాజు కృప వల్ల వివాహ యోగం, కుటుంబ ఐక్యత సిద్ధిస్తాయి.

9. నీల తీర్థం!
నీల తీర్థంలో స్నానం చేస్తే పరాక్రమం, శౌర్యం పెరుగుతాయి.

10. శంఖ తీర్థం!
శంఖ తీర్థం విష్ణు ప్రసాదమని విశ్వాసం. ఈ తీర్థంలో స్నానం చేస్తే సంపూర్ణ శాంతి, భయ నివారణ కలుగుతాయి.

11. చక్ర తీర్థం!
సుదర్శన చక్ర శక్తికి ప్రతీక ఈ తీర్థం. చక్ర తీర్థంలో స్నానం చేస్తే పాప నాశనం, కష్ట నివారణ కలుగుతాయి.

12. బ్రహ్మ హతీ విమోచన తీర్థం!
బ్రహ్మ హతీ విమోచన తీర్థంలో స్నానం చేస్తే బ్రహ్మహత్యా దోషం వంటి భయంకరమైన దోషాలు కూడా కూడా భస్మమవుతాయి. నూతన ప్రారంభాలు విజయవంతం అవుతాయి.

13. శివ తీర్థం!
ఈ తీర్థాన్ని పరమ శివానుగ్రహంగా భావిస్తారు. శివ తీర్థంలో స్నానం చేస్తే రోగాలు, అపశకునాలు శాంతిస్తాయి.

14. సూర్య తీర్థం!
సూర్య తీర్థంలో స్నానం చేస్తే పుణ్యఫలం, ఆరోగ్యం, ఓజస్సు, శరీర కాంతి వృద్ధి చెందుతాయి.

15. చంద్ర తీర్థం!
చంద్ర తీర్థం మానసిక శాంతికి కేంద్రం. ఈ తీర్థంలో స్నానం చేస్తే స్థిరమైన బుద్ధి కలుగుతుంది. కోపం నివారించబడుతుంది.

16. గంగా తీర్థం!
గంగా తీర్థంలో స్నానం చేస్తే అఖండ పాప పరిహారం అవుతుంది. జీవితంలో శుభప్రవాహల పరంపర కొనసాగుతుంది.

17. యమునా తీర్థం!
యమునా తీర్థంలో స్నానం చేస్తే దారిద్ర నిర్మూలన, శాంతి, సౌమ్యత చేకూరుతాయి.

18. గోదావరి తీర్థం!
గోదావరి తీర్థంలో స్నానం చేస్తే ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. శారీరక బలం పెరుగుతుంది. దీర్ఘాయుష్షు చేకూరుతుంది.

. సర్వ తీర్థం
సర్వ తీర్థంలో స్నానం చేయడం వలన సంస్కార శుద్ధి, కర్మ సిద్ధి కలుగుతుంది.

20. నర్మదా తీర్థం!
ఈ తీర్థం శక్తిమంత జలశుద్ధి కేంద్రం. నర్మదా తీర్థంలో స్నానం చేయడం వల్ల రుణ విమోచనం కలుగుతుంది.

21. సింధు తీర్థం!
సింధు తీర్థంలో స్నానం చేయడం వలన ప్రభావ శీలత, బల సంపత్తి కలుగుతాయి. విఘ్న నాశనం అవుతుంది. 2

22. కోటి తీర్థం!
ఇదే 22వ, అత్యంత శక్తివంతమైన బావి. అన్ని తీర్థాలలో కెల్లా విశిష్టమైనది కోటి తీర్థం. విశాలాక్షి అమ్మవారికి తూర్పు వైపున ఈ కోటి తీర్థం కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు తన మేనమామ కంసుని సంహరించిన తరువాత ఆ పాపాన్ని పోగొట్టుకోవడానికి ఈ తీర్థంలో స్నానం చేశాడని స్థల పురాణం చెబుతోంది. అన్ని బావుల సారాంశంగా ఈ తీర్థం పుణ్యఫలం ఇస్తుంది. 22 తీర్థాల స్నాన ఫలం

రామేశ్వర క్షేత్ర దర్శనానికి వెళ్లిన భక్తులు తప్పనిసరిగా సముద్ర స్నానంతో మొదలు పెట్టి ఈ 22 తీర్థాలలో స్నానం చేసిన తర్వాతనే రామ లింగేశ్వర స్వామిని దర్శించుకోవాలి. అప్పుడే రామేశ్వరం యాత్ర సఫలం అవుతుందని స్కంద పురాణంలో వివరించి ఉంది. ప్రతి మాసంలో పౌర్ణమి, అమావాస్య రోజులతో పాటు మకర సంక్రాంతి, రథసప్తమి, , మహాశివరాత్రి, సూర్య చంద్ర గ్రహణ సమయాల్లో ఈ తీర్థాల్లో లక్షలాదిమంది పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. మనం కూడా రామేశ్వరం వెళ్లి పుణ్య తీర్థాలలో స్నానం చేసి రామలింగేశ్వరుని దర్శించుకుని పునీతులమవుదాం.

ఓం నమః శివాయ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు శ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయంద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా భావిస్తారు. వాటిలో ప్రధాన తీర్థం "అగ్ని తీర్థం". అదే బంగాళా ఖాతం సముద్రం. శ్రీ రామేశ్వరుని దర్శించుకునే ముందు భక్తులు ముందుగా సముద్ర స్నానం చేయాలి. రెండవది రామేశ్వరానికి సమీపంలో ధనుష్కోటి మార్గంలో ఉన్న జటా తీర్థం. రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చి ఈ తీర్థంలో ముందుగా తన జటను తడుపుకుని ఆ తరువాత స్నానం చేశాడట. అందుకే ఈ తీర్థానికి 'జటా తీర్థం' అనే పేరు వచ్చింది. ఈ రెండు కాకుండా రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలో మరో 22 పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటి విశిష్టతను తెలుసుకుందాం.ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా

# హైదరాబాద్‌లోనే మరో శిర్డీ -ఈ ఆలయంలో అడుగుపెట్టగానే మనసు ఎందుకు ప్రశాంతమవుతుందో తెలుసా?




మహారాష్ట్రలో మారుమూల గ్రామమైన శిర్డీ సాయినాథుని పవిత్ర చరణ స్పర్శతో పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రంగా మారింది. ఫకీరుగా పరిచయమైన సాయిబాబా భక్తుల హృదయాల్లో సద్గురువుగా, సత్యం గల దేవుడిగా శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ కారణంగానే ఆయనని ప్రతిరోజు దర్శించుకోవాలని, పూజించుకోవాలని భక్తులు తహతహలాడుతారు. అందుకోసం తమ గ్రామాల్లో ఆయనకి ఆలయాలు నిర్మించారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేసి, హారతులిచ్చి ఆ స్వామి అనుగ్రహాన్ని పొందుతున్నారు. అలా భక్తులు నిర్మించుకున్న ఓ సాయిబాబా ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

దైవం మానవ రూపంలోసాయిబాబాను దత్తాత్రేయ స్వరూపంగా భావించి పూజిస్తారు. సాక్షాత్తు త్రిమూర్తుల అంశ మానవ రూపంలో మన మధ్య కదలాడినందుకు చిహ్నంగా సాయిబాబాకు అనేక ఆలయ నిర్మించి భక్తులు తమ భక్తి విశ్వాసాలు చాటుకున్నారు. ఆ కోవలోకి చెందినదే హైదరాబాద్ హస్తినాపురంలో వెలసిన సాయినాధుని ఆలయం. ఈ ఆలయ విశేషాలు ఇప్పుడు చూద్దాం.ఆలయ విశేషాలుహైదరాబాద్ సరూర్ నగర్ మండల పరిధిలోని హస్తినాపురంలో వెలసిన సాయిబాబా ఆలయం సాయినాథుని పై భక్తులకు ఉన్న భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఎంతో మహిమాన్వితంగా భావించే ఈ ఆలయం ప్రశాంతమైన వాతావరణంలో వెలసి ఉంది. ఆలయంలోకి ప్రవేశించగానే పాపరాశిని ధ్వంసం చేసే ధుని కనిపిస్తుంది. భక్తులు ముందుగా ధునికి ప్రదక్షిణలు చేసి, వేపచెట్టు నీడలో గల గురు స్థానాన్ని దర్శించుకుంటారు. ఆ తరువాతే ప్రధాన మంటపంలో ప్రవేశిస్తారు.సమ్మోహనపరిచే బాబా విగ్రహంప్రధాన మండపంలోకి ప్రవేశించగానే వేదికపై చిరుమందహాసం చేస్తున్న సాయినాథుని దివ్య రూపం దర్శనమిస్తుంది. ఎంతటి క్లిష్టమైన సమస్యలు ఉన్నప్పటికీ ఒకసారి సాయినాథుని దర్శించుకోగానే మనసుకు ఒక విధమైన స్వాంతన చేకూరుతుందని భక్తులు అంటారు. ఈ ఆలయంలోకి అడుగు పెట్టిన భక్తులు సాయిని దర్శించగానే ప్రశాంతతను, ఉపశమనాన్ని పొందుతారు. ఇక ఆలయ ప్రాంగణంలో రామాలయం, ఆ పక్కనే గణపతి మందిరం, నవగ్రహాలను కూడా దర్శించుకోవచ్చు.పూజోత్సవాలుహస్తినాపురం సాయినాథుని ఆలయంల శిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగినట్లుగానే ప్రతిరోజూ అభిషేకాలు, నాలుగు కాలాల్లో హారతి జరుగుతుంది. ప్రతి గురువారం పల్లకీసేవ, పవళింపు సేవలు ఘనంగా నిర్వహిస్తారు. ఇక్కడ బాబా పల్లకీని ఊరేగించడానికి అనుకూలంగా, ఆలయం విశాలమైన నాలుగు మాడ వీధులు ఉండడం విశేషంగా చెప్పుకోవాలి. ఇక ఏడాదికోసారి శ్రీరామనవమి ఉత్సవాలు, గురుపౌర్ణమి ఉత్సవాలు, ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.పల్లకి సేవలో పాల్గొనే విద్యార్థుహస్తినాపురం సాయినాధుని ఆలయంలో ప్రతి గురువారం జరిగే పల్లకి సేవలో ప్రత్యేకించి విద్యార్థులు ఎక్కువగా పాల్గొనడం విశేషం. సాయినాధుని పల్లకీ మోసిన విద్యార్థినీ విద్యార్థులు అత్యున్నతమైన స్థాయిలో ఉత్తీర్ణతను సాధిస్తూ, విదేశాల్లో సైతం ఉద్యోగాలను పొందుతూ వస్తున్నారు. అందువలన ఇక్కడి పల్లకీసేవలో యువతీ యువకులే ఎక్కువగా కనిపిస్తూ వుంటారు. అంతేకాదు వివాహం కావాల్సిన వారు ఒకసారి సాయినాధుని పల్లకి మోస్తే ఏడాది తిరిగేసరికల్లా వివాహం కావడం ఖాయమని కూడా భక్తులు చెబుతుంటారు.సబ్ కా మాలిక్ ఏక్!అనంతమైన ఈ విశ్వంలో ఉన్న భగవంతుని స్వరూపం ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా అందరూ ఆ పరమాత్మను అనుసరించాలని లోకానికి చాటి చెప్పిన మహనీయుడు సాయిబాబా. ఆయన బోధించిన సూత్రాలను అనుసరించడం ద్వారా ఆధ్యాత్మిక మార్గంలో అలౌకిక ఆనందాన్ని పొందవచ్చు. మనకు అతి సమీపంలో ఉన్న హస్తినాపురం సాయినాథుని ఆలయాన్ని మనం కూడా దర్శిద్దాం సాయినాథుని అనుగ్రహాన్ని పొందుదాం.

ఓం శ్రీ సాయినాథాయ నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# తిన్న వెంటనే ఆకలిగా ఉంటుందా? - ఇలా ఎందుకు అవుతుందో తెలుసా?



ఆకలి వేస్తే భోజనం చేస్తాం. అనుకోకుండా నచ్చిన ఫుడ్ కనిపిస్తే జిహ్వ కోరికని తీర్చేస్తాం. అయిత్త ఎంత తిన్నా ఒక మోతాదు వరకే తీసుకోవాలి. కానీ, కొంతమంది మాత్రం ఆకలి తీరినా, ఎన్ని రకాల రుచులు ఆరగించినా ఇంకా ఏం తినాలా? ఎప్పుడు తినాలా? అని ఆలోచిస్తుంటారు. ఆకలి వేయకపోయినా సరే, మనసులో అవే ఆలోచనలు. దీన్నే 'ఫుడ్ నాయిస్' అంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిళ్లు, భావోద్వేగాల వల్ల జీవనశైలి, ఆహారంలో వచ్చే మార్పు అని చెబుతున్నారు. ఈ క్రమంలో 'ఫుడ్ నాయిస్' నియంత్రించుకోలేకపోతే ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!ఎలా గుర్తించాలి? : భోజనం చేసిన తర్వాత కడుపు నిండిన భావన. అయినా ఇంకేం తినాలి? అని ఆలోచన. బ్రేక్?ఫాస్ట్ తింటూనే మధ్యాహ్నం ఏం తింటే బాగుంటుందని, లంచ్ చేస్తూ సాయంత్రం స్నాక్స్ గురించి, ఆ తర్వాత రాత్రి భోజనం గురించి ఇలా మనసంతా ఎప్పుడూ ఫుడ్ గురించే ఆలోచిస్తుంటారు. ఒత్తిడికి లోనైనప్పుడు, బాధ కలిగినప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు ఇలా సందర్భం ఏదైనా సరే, ఆహారం తింటూ ఊరట పొందుతుంటారు. బరువు తగ్గడానికి డైట్‌లో ఉందామనీ అనుకుంటారు. అదే విధంగా మొదలు పెడతారు. కానీ, మామూలు రోజుల్లో కంటే మరింత ఎక్కువగా తినాలనిపిస్తుంటుంది. ఇవన్నీ ఫుడ్ నాయిస్‌కు సంకేతాలంటున్నారు నిపుణులు.చర్మం పొడిబారడం, జుట్టు రాలిపోవడం! - ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్? కావాలంటున్న నిపుణులుఎందుకొస్తుంది? :

చాలా మంది బరువు పెరగకూడదని, ఫిట్‌నెస్ పేరుతో ఆహారం విషయంలో ఆంక్షలు పెట్టుకుంటారు. 'వీటి జోలికి వెళ్లకూడదు' 'అవి తినకూడదు' అని అనుకుంటారు. ఇలాంటప్పుడు ఆహారంపై ఆలోచనలు మరింత పెరుగుతాయి. నియంత్రించుకోవడం చాలా కష్టమవుతుంది.

మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు, భావోద్వేగాలకు గురైనప్పుడు కొంతమందిలో ఏదైనా ఆహారం తినాలనే ఆలోచన వస్తుంటుంది. అలాంటి వారిలో బాధ, ఆందోళన, ఒంటరితనం, కోపం వంటివి ఫుడ్ నాయిస్‌ను పెంచుతాయి.సరిపడా నిద్ర లేకపోతే మెదడు ఉపశమనాన్ని కోరుకుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలోచనలు ఫుడ్?పైకి మళుతాయి. ఏమైనా తినగానే మెదడు తక్షణ ఆనందాన్ని పొందుతుందట.

శరీరంలో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక మార్పులు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆకలి లేకపోయినా ఏమైనా తినాలనిపిస్తుందట. చాలామంది దీన్ని గుర్తించకలేక తినేస్తుంటారు. ఈ మధ్య సోషల్‌మీడియాలో ఫుడ్ వ్లాగ్ వీడియోలు పెరిగాయి. వివిధ ప్రాంతాల్లో ఉండే ఫుడ్‌ను పరిచయం చేస్తూ వ్లాగర్లు వీడియోలు యూట్యూబ్, సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు, ప్రకటనలు చూసి నోరూరుతుంది.

ఆకలిని గుర్తించడం కష్టమే : 'ఆహారం మితంగా తింటే అమృతం, అతిగా తింటే విషం' అని అంటుంటారు పెద్దలు. ఫుడ్ నాయిస్ ప్రభావంతో అతిగా తినడం వల్ల బరువు నియంత్రణలో ఉండదు. శరీరంలోకి కొవ్వు పెరిగి ఒబెసిటీ వచ్చే ప్రమాదం ఉంది. నిజమైన ఆకలి ఏదో గుర్తించడం కష్టమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే, బయట హోటల్స్, ఫుడ్‌స్టాల్స్‌లో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ఫుడ్ నాయిస్ వల్ల ఊబకాయంతో బాధపడవచ్చు, ఇది స్లీప్ అప్నియా, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌కు కూడా దారితీస్తుందని ఎశ్రీవజవశ్రీఖఅఐ అధ్యయనం పేర్కొందిఎలా నియంత్రించాలి? :

స్వయంగా లేదా డాక్టర్ల సాయంతో శరీరాన్ని అర్థం చేసుకోవాలి. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించాలి. నిజంగా ఆకలవుతోందా?భావోద్వేగాల కారణంగా అలా అనిపిస్తోందా అని ఒకటికి రెండు సార్లు మనల్ని ప్రశ్నించుకోవాలి.ఫుడ్ నాయిస్‌ను నియంత్రించుకోవాలని పూర్తిగా నోరు కట్టేసుకోవద్దు. ఇష్టమైన వాటికి దూరం పెట్టొద్దు. ఏది తిన్నా మితంగా, పోషక విలువలున్న సమతులాహారం తినడం మంచిది.

రోజూ వ్యాయామం చేయడం, తగినన్ని నీరు తాగడం, తగినంత నిద్ర తప్పనిసరి. తినే సమయంలో ఫోన్ వాడకుండా, టీవీ చూడకుండా తినే ఆహారంపైనే దృష్టి పెట్టాలి. రుచి, వాసనను ఆస్వాదిస్తూ భోజనం చేయాలి ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వల్ల ఏదో ఒకటి తినాలపిస్తుంది. ఇలాంటప్పుడు వెంటనే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేయకుండా, కాసేపు నడవడం, కొన్ని క్షణాలు ధ్యానం చేయండి. వీలైతే కాసేపు సంగీతం వినండి. ఇంత చేసినా ఆకలి తీరకపోతే అప్పుడు జంక్‌ఫుడ్ కాకుండా పోషకాలనందించే ఆహారం తీసుకోండిచీూుజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు..?

ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురింగి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల




వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధిం చడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చ రిస్తున్నా రు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డం కిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథ కాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముం దుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

## నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** గత నాలుగేళ్లుగా అంటే 2021–2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021–2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ



పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేథావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి



**• లోక్‌సభలో బిజెపి ఎంపి నిషికాంత్ దూబె తీర్మానం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఏంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా–భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

## రైతుల ప్రయోజనాలపై మోడీ అబద్దాలు

**వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు**

**భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని భారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్–అమెరికా ఒప్పందం జరిగిన తీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టి దానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని, ఒత్తిడితో కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు. ఈ ఒప్పందం భారత రైతులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికా మన దేశంలోకి సబ్సిడీతో కూడిన వస్తువులను కుమ్మరిస్తుందని, ఫలితంగా మన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించలేరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడతామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విలేకరులు ప్రస్తావించగా 'అది అబద్ధం చెబుతోంది. వారు ఏమైనా చెప్పుకోనివ్వండి. నిరసనలు తప్పవు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను గ్రామాలలో రైతులు దగ్ధం చేస్తారని, ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతారని అన్నారు. 'మా ట్రాక్టర్లకు ఢిల్లీ ఎంతో దూరంలో లేదు. అవి సిద్ధంగానే ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం భారత్‌కు న్యాయసమ్మతం కాదని ఆర్జేడీ ఎంపి సుధాకర్ సింగ్ చెప్పారు. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన ఒప్పందం కాదని, భారత్ 18 శాతం సుంకం కడుతుంటే అమెరికా మాత్రం సున్నా టారిఫ్‌కే పరిమితమవుతోందన్నారు. ప్రతిపాదిత విత్తన బిల్లును కూడా ఆయన వ్యతిరేకించారు. రైతులు అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. అమ్‌ఆద్మీ పార్టీ ఎంపి సంజరు సింగ్, ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్గి కారు

**• ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్గిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్గిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు శివం మూర్ఛపోయాడని.. అతడిని ఒక చేత్తో పట్టుకొని కారు నడిపానని వెల్లడించారు. ఈ క్రమంలో కారు ఓ ఆటోని ఢీకొట్టిందని, ఆ తర్వాత డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయిందని వెల్లడించాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో లాకింగ్ సిస్టమ్ వల్ల తాను బయటకు రాలేకపోయానని, శివంను డ్రైవర్ సీటులోకి మార్చి.. తాను మరో సీటులోకి వెళ్లినట్లు వివరించాడు. అయితే, ప్రమాద సమయంలో కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసులు నిర్ధరించారు. ఘటన అనంతరం అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు తీసిన వీడియోలు కూడా వెలువడ్డాయి. పోలీసుల వాదనలను గమనించిన న్యాయస్థానం మోహన్ లొంగిపోవడాన్ని నిరాకరించింది.

## అభివృద్ధి పథంలో మొట్లగూడ సర్పంచ్



**కొమరంబీమ్ ఆసిఫాబాద్,:ఫిబ్రవరి 12,** :కొమరంబీమ్ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం దహెగాం మండలం లో గత డిసెంబర్ లో జరిగిన సర్పంచ్ ఎలక్షన్ లలో విజయం సాధించిన నూతన సర్పంచ్ గ్రామంలో విజయం ఐతే నేను గ్రామం లో అభివృద్ధి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చి నందున అన్నమాట ప్రకారంగ్రామాభివృద్దే మా ద్యేయం అని అన్నారు. అందుకు అనుకూలంగా ప్రభుత్వం నుండి బడ్జెట్ వచ్చిన రాకున్నా గ్రామ ప్రజలకు సేవా చేయాలనే సంకల్పం తో ముందుకు కొనసాగుతున్నారు. నా గ్రామం నా అభివృద్ధి అంటు ముందుకు వెళ్తున్న దహెగం మండల మొట్లగూడ గ్రామనికి చెందిన కనక శకుంతల - రమేష్ తన సొంత డబ్బుల తో రోడ్స్, డ్రైనింగ్స్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు,,అతడు చేసిన పనులను చూసి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు,,ఇలాంటి సర్పంచున్ను ఎన్నుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని ఇంకా 10సంవత్సరాలైన ఈ సర్పంచే బాధ్యత వహిస్తూ అభివృద్ధి చేస్తారని నమ్మకం ఉందని గ్రామ ప్రజలు ప్రశంస ము అందిస్తున సర్పంచ్ కు కృతజ్ఞతలు గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కార్పెత తిరుపతి, వార్డు సభ్యులు షేక్ బబ్లుబాయ్, కనక పాపయ్య, మామిడిపల్లి మల్లేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చాందా గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



**ఆదిలాబాద్ :ఫిబ్రవరి 12,** ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా (టి) గ్రామంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఫైనాన్షియల్ లిటరసీ వీక్ - కేవైసి కార్య్ర కమాన్ని గ్రామ సర్పంచ్ కస్తూరి మంజుషా అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎస్బిఐ రీజినల్ మేనేజర్ రామచంద్ర రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్ కుమార్ ధాం హాజరై మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా కేవైసీ అప్డేట్ చేసుకోవాలన్నారు. మీ కేవైసీ - సురక్షితమైన బ్యాంకింగ్ కు తొలి అడుగు అనే నినాదంతో ప్రతి ఒక్క వినియోగదారునికి అంతరాయం లేని, సురక్షితమైన బ్యాంకు సేవలు అందించడానికి ఈ కార్యక్రమం ఆర్.బి.ఐ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, తప్పకుండా కేవైసీ చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తు అవసరాల కొరకు సంపాదించే డబ్బును పొదుపు చేసుకోవాలని అన్నారు. డిజిటల్ పేమెంట్స్ తో లావాదేవీలు సులభతరం అవుతాయని అన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలు తెలుపవద్దని అన్నారు. మొబైల్ కు వచ్చే లింక్స్ ఓపెన్ చేయవద్దని, ఓటీపీ షేర్ చేయకూడదని తెలిపారు. ఇలాంటి అనుమానం ఉన్న 1930కు సంప్రదించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ద్వారానే సైబర్ మోసాలను అరికట్టవచ్చని అన్నారు.

కార్యక్రమంలో ఎస్బిఐ ఎఫ్ఐ మేనేజర్ విజయ్, ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ ప్రణీత రెడ్డి, ఫైనాన్షియల్ లిట్రసి కౌన్సిలర్ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి నసీమా, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, గ్రామస్తులు కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు

## వైద్య శిబిరాలతో గ్రామ స్థాయిలో ఆయుర్వేద వైద్య సేవలు : డాక్టర్ హేమాక్షి

- పార్వతిపురం మన్యం జిల్లా. ఫిబ్రవరి 12 మన లక్ష్యం



**సీతానగరం,ఫిబ్రవరి12:** గ్రామ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్నామని బూర్జ,ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ టి. హేమాక్షి అన్నారు. ఈ మేరకు ఇప్పలవలస గ్రామంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ హేమాక్షి పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా వాత వ్యాదులు, దగ్గు, పడిశము, ఆస్తమా, జీర్ణకోశ సమస్యలు, మలబద్ధకం, చర్మ సంబంధిత సమస్యలకు పరీక్షించి ఆయుర్వేద మందులు అందజేశారు. అలాగే మందులు వినియోగించే విధానాన్ని వివరించారు. అనంతరం డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ మండలంలో వైద్య శిబిరాల ద్వారా పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుర్వేద వైద్యం, ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ స్టాఫ్ పద్మ, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

## జల్లి అంగన్వాడి కేంద్రంలో అక్షర అబ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారిని సరళ



**చెన్నారావుపేట:12 ఫిబ్రవరి** :వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం,జల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం అక్షర అభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారిని సరళ హాజరయ్యారు. అంగన్వాడి కేంద్రంలో 3 సంవత్సరాలు నిండిన పిల్లలకు మండల విద్యాశాఖ అధికారిని సరళ, గ్రామ ఉప సర్పంచ్ మేరుగు బాబు, అంగన్వాడీ ఉపాధ్యాయులు కృష్ణవేణి, రజిత అక్షర అభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఈర్య సార్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చెన్నారావుపేట మండల కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ

**-కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి: కార్మిక సంఘాల నాయకులు**




**చెన్నారావుపేట: 12 ఫిబ్రవరి** వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండల కేంద్రంలో దేశవ్యాప్త సమ్మె కార్మిక సంఘాల పిలుపులో రైతులు కార్మిక సంఘాల నాయకులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.అనంతరం కార్మిక సంఘాల కో'ఆర్డినేటర్ పరికి మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సివిల్ సప్లై అమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నవ్విండ్ల స్వామి, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ మొగులోజు శారద మాట్లాడుతూ: కేంద్రంలో బిజెపి అధికా రంలోకి వచ్చినప్పటి నుండి కార్మికుల పట్ల కపట ప్రేమ నటిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని వారు అన్నారు. పోరాడి సాధించుకున్న అనేక లేబర్ కోడ్ చట్టాలను, నాలుగు లేబర్ చట్టాలుగా వ్యవహరిస్తుందని, తక్షణమే నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని, వ్యవసాయ రంగంలో నూతన ఆర్థిక విధానాలు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని, నూతనంగా విత్తన, విద్యుత్, మార్కెట్ చట్టాలను ఉపసంహ రించుకోవాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పత్తి అనంతరెడ్డి, సిపిఎం నాయకులు మొగిలి జనార్ధన్ రెడ్డి, అంగన్వాడి యూనియన్ నాయకులు అల్వాల కళ్యాణి, ఘర్నాపల్లి రాజు, మార్గం రాజ్కుమార్, కోరే కార్తిక్, హనుమాన్ల ఉపేందర్, బాపట్ల వీరేశం,పులి రవీందర్, సరోజన, పిట్టల సుధాకర్, నూకల లక్ష్మి, విజయ, రాధిక, పూలమ్మ, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ, హమాలి సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నర్సంపేటలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నర్సంపేట: 12 ఫిబ్రవరి** వరంగల్ జిల్లా, నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన నర్సంపేట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలిం చారు.ఈ సందర్భంగా వార్డు వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు, అభ్యర్థుల గ్యాలరీలు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరా పర్యవేక్షణ వంటి అంశాలను కలెక్టర్ సమీక్షిం చారు.కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లు మరియు మీడియా ప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పరిశీలించారు. అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ: కౌంటింగ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, మొత్తం 6 రౌండ్లలో, 10 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, మునిసిపల్ కమిషనర్ భాస్కర్,

తహశీల్దార్ రవిచంద్రరెడ్డి, సిఐ సాయన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి నిర్మూలన పై అవగాహన కార్యక్రమం



**పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఫిబ్రవరి 12** వెట్టి చాకిరి నిర్మూలన చట్టం--1976 అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సాలూరు యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెట్టి విమోచన కూటమి జిల్లా కన్వీనర్ పి. వేణుగోపాలరావు నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి నిర్మూలన చట్టం ద్వారా బానిస కార్మిక వ్యవస్థను చట్టపరంగా రద్దు చేసి, కార్మికులకు స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవన హక్కు కల్పించబడిందని తెలిపారు. అప్పుల బారినపడి బలవ ంతపు శ్రమకు గురయ్యే పరిస్థితులను గుర్తించి, అటువంటి ఘటనలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలు, చట్టపరమైన రక్షణల గురించి కూడా వివరించారు.నీడ్ సంస్థ బృందం సభ్యులు చట్టంలోని ముఖ్య అంశాలు, కార్మికుల హక్కులు, ఫిర్యాదు చేసే విధానం తదితర విషయాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. యువత చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సాగర్, నీడ్ బృంద సభ్యులు, యువత పాల్గొన్నారు. సమాజంలో వెట్టి చాకిరి వంటి దురాచారాలు పూర్తిగా నిర్మూలన కావాలంటే ప్రజలందరూ చైతన్యవంతులై బాధ్యతగా వ్యవహరించాలని వక్తలు ఆకాంక్షించారు.

## చట్టాలను రక్షించుకుందాం, హక్కులను కాపాడుకుందాం :టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్




**వరంగల్ జిల్లా:12 ఫిబ్రవరి** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు నష్టపోతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ అన్నారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వ ర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూ: కార్మిక చట్టాలను రక్షించు కుందామని, హక్కులను కాపాడుకుందామని పిలుపునిచా ్చరు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను టీడబ్ల్యూజేఎఫ్ వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్న మోడీ సర్కారు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసేవరకు జాతీయ కార్మిక సంఘాలతో ఐక్యంగా పోరాటం కొనసాగుతుందన్నారు. రద్దయిన 29 చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి రెండు చట్టాలు కూడా ఉన్నాయని తెలిపారు. జర్నలిస్టుల కనీస వేతనాలకు సంబంధించి గురుబక్ష్ మతీజియా వేజ్ బోర్డు సిఫారసులను కేంద్రం అమలుచేయడం లేదని ఆరోపించారు.ఉన్న చట్టాన్ని కోడ్ లుగా మార్చి పాత్రికేయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు అనంతుల రమేష్, జిల్లా కోశాధికారి గాయపు రాజు రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈర్ల సురేందర్, మచ్చిక వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రాల శ్రీనివాస్, బండారి బాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ ఆవిర్భావం

- జిల్లా స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్





**కొమరంబీమ్ఆసిఫాబాద్:ఫిబ్రవరి 12,:**కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ ఆవిర్బావ సందర్భంగాజిల్లాలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిం చారు. కుమురం భీమ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఐ టి డి ఏ బెజ్జూర్ టీచర్స్ జట్టు ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. గెల్పొందిన జట్టులకు గోలేటి సింగరేణిజనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్, క్రీడలా నిర్వాహకులు జాడి జ్ఞానేశ్వర్ , అనిల్ ,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ పాలకోవా విక్రయాలపై టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు

- 120 కిలో గ్రాముల కల్తీ కోవాను స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



తాండూర్ ఫిబ్రవరి 13 : ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే కల్తీ ఆహార పదార్థాల తయారీ, తయారుదారులు విక్రయదారులను కఠినంగా శిక్షించేందుకు వికారాబాద్ జిల్లా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. గురువారం వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ కోవా తయారీ, అమ్మకాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, ఇన్స్పెక్టర్ ఎండీ అన్వర్ పాషా నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక దాడి నిర్వహి ంచింది. తనిఖీ సమయంలో, సుమారు 120 కిలోగ్రాముల కల్తీ కోవాను స్వాధీనం చేసుకు న్నారు. ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడినందుకు రాజస్థాన్‌కు చెందిన ప్రకాష్ విష్ణు, చంద్రా యణగుట్టకు చెందిన మహమ్మద్ సల్మాన్ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న కల్తీ కోవాను నిందితుడితో పాటు తాండూరు పోలీసులకు అప్పగించారు. తాండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడి దర్యాప్తు జరుగుతోందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఆహార కల్తీకి పాల్పడి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్నేహ మెహ్రా హెచ్చరించారు. ఎవరైనా కల్తీ ఆహార తయారీ లేదా అమ్మకాలు జరిపితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరిన ఎస్పీ స్నేహ మెహ్రా,

## ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్



వికారాబాద్ ఫిబ్రవరి 13 : మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఓట్లు లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి, ఎన్నికల సంఘం మార్గద ర్శకాలు, టేబుల్‌వైజ్ కౌంటింగ్ విధానం, బ్యాలెట్ పేపర్లు వేరు చేయుట, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్రంగా సూచనలు చేశారు. ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమ త్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధ నలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని, మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అనుమతి పొందిన వ్యక్తులకే ప్రవేశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు సిబ్బంది సమయానికి కేంద్రాలకు హాజరై తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎలాంటి పొరపా ట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాలుగు మున్సిపల్ కమిషనర్ లతో కౌంటింగ్ ఏర్పాట్ల పై వివరాలు అడిగి తెలుసు కున్నారు. జిల్లా ఎస్ పి స్నేహ మెహర మాట్లాడుతూ స్పెషల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామని, డి ఎస్ పి లను ఏర్పాటు చేస్తూ పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సుధీర్,వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్,మున్సిపల్ కమిషనర్లు,తహసీల్దార్ లు స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దోషాలుంటే వాస్తు ప్రకారం భారీ మార్పులు చేయొద్దు.. ఈ చిన్న పని చాలు




వాస్తు లేకుండా ఇంటి నిర్మాణం జరగదు. ఏ కట్టడం అయినా వాస్తును అనుసరించే కడతారు. అయినా దోషాలున్నాయనిపిస్తే చాలా మంది భారీగా మార్పులు చేస్తూ, చాలా భారీగా ఖర్చుపెడుతుంటారు. కానీ అంత ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. కొంతమందికి ఎన్నడూ లేనంతగా సమస్యలు ముసురు కుంటు ంటాయి. డబ్బు చేతిలో నిలవదు. సహాయం అందదు. వ్యతిరేక శక్తి ఇంట్లో ఉందేమో అనిపిస్తుంటుంది. అటువంటప్పుడు వాస్తు దోషాలను తెలుసుకొని చిన్న చిన్న మార్పులు లేదంటే కొన్నిరకాల చిత్రపటాలను ఇంట్లో ఉంచుకుంటే సరిపోతుంది. ఖర్చు కూడా ఆదా అవుతుంది అని చెబుతున్నారు వాస్తు నిపుణులు.కమలాన్ని శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా కొలుస్తారు.కమలం చిత్రపటం ఇంట్లో ఉంటే లక్ష్మీదేవి ఉన్నట్లే .ప్రతికూల శక్తి పారిపోతుంది.దీన్ని తూర్పు దిశలో ఉంచాలి.ప్రశాంతంగా ధ్యానంలో కూర్చొని ఉండే బుద్ధుడి చిత్రపటం పెట్టుకోవాలి.తూర్పు దిశగా లేదంటే ఈశాన్యం దిశగా పెట్టుకోవాలి.బుద్ధుడిని చూడగానే మనసులోని అలజడి మాయమైపోతుంది.జారే జలపాతం అలజడి మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.ఈ చిత్రపటం ఇంట్లో ఉంటే ప్రతికూల శక్తి తొలగిపోతుంది.ఈశాన్యంలో పెడితే ఆర్థికంగా మంచి వృద్ధి ఉంటుంది.కొండలున్న చిత్రపటాన్ని పెట్టుకోవాలి.మనిషి జీవితంలో పైకి చేరుకునేందుకు వేసే ప్రతి అడుగు ఎంతో కష్టంగా ఉంటుంది.పైకి చేరుకున్న తర్వాత పొందే ఆనందం వేరు.కష్టాలనే కొండను కచ్చితంగా ఎక్కాలి.దీన్ని నైరుతి దిశలో ఉంచితే బాగా కలిసివస్తుంది.గోడలకు మంచి చిత్రపటాలు పెట్టు కోవాలి.దక్షిణం దిశగా పరిగెత్తే గుర్రా లున్న చిత్రపటాన్ని పెట్టుకోవాలి.

దీన్ని దక్షిణ దిశగా పెడితే కెరీర్ ఊపం దుకుంటుంది.పురి విప్పిన నెమలి చిత్రపటం ఉండాలి.ఇది దక్షిణ దిశలో ఉంటే ఆదాయం పెరుగుతుంది.నెమలి వల్ల అదృష్టం కలిసివస్తుంది.

## ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం

- విజయోత్సవ ర్యాలీలు నిషేధం
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




వికారాబాద్ ఫిబ్రవరి 13 : మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ.. ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా, జిల్లాలోని నాలుగు మునిసిపల్ పట్టణాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో, అలాగే కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతా ల్లో,విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం పూర్తిగా నిషేధించబడినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఫలితాలు వెలువడిన అనంతరం కూడా ప్రజలు సంయమనం పాటించాలని, ఉత్సాహంలో ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ, తెలిపినారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిర్దిష్ట పరిధిలో సీఆర్పీసీ 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సెక్షన్ అమలులో ఉన్న సమయంలో ఐదుగురికి మించి గుమికూడదం, నినాదాలు చేయడం, లౌడ్ స్పీకర్లు, డీజేలు, సౌండ్ బాక్స్‌లు లేదా ఇతర శబ్ద విస్తరణ పరికరాల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ, హెచ్చరించారు. జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, డీజే యజమానులు, ఈవెంట్ నిర్వాహకులు మరియు వారి అనుచరులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ తెలిపారు.

## కుంభరాశిలోకి సూర్యుడు.. రేపటి నుంచి ఈ రాశుల జాతకం మారుతోంది



గ్రహాలకు అధిపతి అయిన సూర్య భగవానుడు ప్రతి 30 రోజులకు ఒకసారి తన రాశిని మారుస్తుంటాడు. ఈ నెలలో మకర రాశి నుంచి శనిదేవుడి సొంత రాశి అయిన కుంభరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన ఈ పరిణామం సంభవించనుంది. ఇది చాలా శక్తివంతం అని, ఆ ప్రభావంతో కొన్ని రాశులవారి జీవితాల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని జ్యోతిష్య పండితులు తెలియజేస్తున్నారు. అంతేకాదు.. అనుకున్న పనుల్లో అద్భుతమైన విజయాలు సాధించబోతున్నారని చెబుతున్నారు. వారి వివరాలను తెలుసుకుందాం.మిథున రాశిఉద్యోగస్థులు వారి వారి కార్యాలయాల్లో మంచి గుర్తింపును పొందుతారు. సీనియర్ల నుంచి మద్దతు లభిస్తుంది. పదోన్నతులతోపాటు వేతనాలు కూడా పెరుగుతాయి. మీడియా, రచన, విద్యకు సంబంధించిన రంగాల్లో పనిచేస్తున్నవారికి పనులు అనుకూలంగా అవుతాయి. అద్భుతమైన విజయాలను సొంతం చేసుకుంటారు. కెరీర్ పరంగా కొత్త అవకాశాలు తలుపు తడతాయి. వాటిల్లో మంచివాటిని ఎంపిక చేసుకుంటే చాలా మంచిది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారికి విజయాలు చెంతనే ఉంటాయి.మేషరాశిఉద్యోగులకు ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. దీనివల్ల వారి ఆదాయం పెరుగుతుంది. ఈ రాశివారికి అదనపు ఆదాయం కోసం కొత్త వనరులు దొరుకుతాయి. అద్భుతమైన విజయాలను సాధిస్తారు. కొంతకాలం పనులవకుండా వేధిస్తున్న సమస్యలన్నింటికీ పరిష్కరం దొరుకుతుంది. సూర్యుడి సంచారం మేషరాశివారికి ఎంతో శుభప్రదమని పండితులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంపై ఆసక్తి పెరుగుతుంది.వృషభ రాశిడిజైన్, ఫ్యాషన్, కళల రంగాల్లో ఉన్నవారికి బాగా కలిసివస్తుంది. వారికి భారీ ఆదాయం చేకూరుతుంది. వ్యక్తిగత జీవితంతోపాటు వృత్తి జీవితంలో సృజనాత్మకత పెరుగుతుంది. కొన్ని కీలకమైన నిర్ణయాలు ముఖ్యమైన వ్యక్తులతో చర్చించి తీసుకుంటే బాగుంటుంది. దీనివల్ల లాభనష్టాలు తెలియడంతోపాటు భారీమొత్తంలో ఆదాయాన్ని ఆర్జిస్తారు.

## మస్త్.. మస్త్.. మస్క్ మిలన్ జ్యూస్: సమ్మర్ హీట్ లో బాడీ రీఛార్జ్



వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలను అందించడానికి ఖర్బూజా పండు అత్యంత అనువైనది. దీనిని కెంట్ లూప్ లేదా హనీడ్యూ అని కూడా పిలుస్తారు. తీపి, కమ్మని, తాజాగా ఉండే ఈ పండు వేసవి తాపాన్ని తగ్గించడానికి అద్భుతమైన ఎంపిక. విటమిన్లు, ఖనిజాలు, నీటి శాతం అధికంగా ఉండే ఖర్బూజా రుచిని మాత్రమే కాకుండా, అనేక ఆరోగ్య లాభాలను అందిస్తుంది. ఈ పండును వేసవి దినచర్యలో చేర్చుకోవడం వల్ల కలిగే లాభాలను ఇప్పుడు చూద్దాం.వేసవిలో శరీరానికి నీటి కొరత రాకుండా చూసుకోవడంలో ఖర్బూజా సహాయపడుతుంది. అధిక నీటి శాతాన్ని కలిగి ఉండటం వల్ల ఇది శరీరానికి అవసరమైన ద్రవాలను అందిస్తుంది. చెమట రూపంలో కోల్పోయిన నీటిని తిరిగి నింపడంలో సహాయపడి, శరీరంలో శక్తి స్థాయిలను కాపాడుతూ, డ్రై నెస్ ను తగ్గిస్తుంది.ఖర్బూజాలో విటమిన్ సీ పుష్కలం. ఇది రోగనిరోధక శక్తిని పెంచే శక్తివంతమైన పోషకం. ఈ ముఖ్యమైన విటమిన్ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, శరీరానికి వ్యాధులు, ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని ఇస్తుంది. వేడి వాతావరణంలో డీహైడ్రేషన్, ఇతర సమస్యల ప్రమాదం ఎక్కువగా ఉన్నప్పుడు ఇది మరింత అవసరం.ఖర్బూజాలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియకు సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను సజావుగా నడిపిస్తుంది. క్రమం తప్పకుండా ఖర్బూజా తినడం వల్ల మలబద్ధకాన్ని నివారించి, ప్రేగు కదలికలను మెరుగుపరుచుకోవచ్చు. ముఖ్యంగా వేసవి వేడిలో ఇది చాలా అవసరం. తక్కువ కేలరీలు, అధిక పోషకాలతో కూడిన ఖర్బూజా బరువును నియంత్రించాలనుకునే వారికి సరైన పండు. దీని తియ్యని, తాజాగా ఉండే రుచి ఆకలిని సైతం తీర్చుకోవచ్చు. అదే సమయంలో కడుపు కూడా తేలికగా ఉంటుంది. సహజ నీటి శాతం అధికంగా ఉండటం వల్ల, అధిక కేలరీలు లేకుండా ఆకలిని దూరం చేసే అద్భుతమైన స్నాక్‌గా పనిచేస్తుంది. ఖర్బూజా పొటాషియంకు మంచి మూలం. ఇది గుండె ఆరోగ్యానికి చాలా ముఖ్యం. పొటాషియం రక్తపోటును నియంత్రించి, గుండెపై ఒత్తిడిని తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇందులో అధికంగా ఉండే నీటి శాతం డీహైడ్రేషన్‌ను నివారించడమే కాకుండా, వ్యాయామం తర్వాత కండరాల రికవరీకి కూడా సహాయపడుతుంది. ఈ పండు- కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్‌లను నింపుతుంది. వ్యాయామం అనంతర రికవరీకి సహాయపడి, కండరాల తిమ్మిర్లు, అలసటను తగ్గిస్తుంది.ఖర్బూజా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది. ఇందులోని అధిక నీరు, పీచు పదార్థం శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడానికి సహాయపడి, మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. మొత్తం శరీరాన్ని శుభ్రపరుస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను కూడా శుభ్రం చేసి, మీకు తాజాదనాన్ని, పునరుజ్జీవాన్ని అందిస్తుంది. ఖర్బూజాలో ఉండే విటమిన్ ఎ, బీటా-కెరోటిన్ ఆరోగ్యకరమైన కంటి చూపునకు చాలా అవసరం.ఈ పోషకాలు కంటి పనితీరుకు మద్దతు ఇస్తాయి, వయస్సు సంబంధిత దృష్టి సమస్యలైన మ్యాక్యులర్ డీజెనరేషన్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ఖర్బూజా నీరు, సహజ చక్కెరలు, ముఖ్యమైన పోషకాల కలయిక కారణంగా సహజంగా శక్తిని అందిస్తుంది. వేసవి వేడిలో శక్తి రీఛార్జ్ అవసరమైన వారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక.

## మోకాలినొప్పికి క్యాబేజీ ఆకుల ట్రీట్‌మెంట్.. పని చేస్తుందా



ప్రస్తుతం చాలామంది మోకాలి నొప్పి సమస్య తో బాగా బాధపడుతున్నారు. మోకాళ్ళ నొప్పి సమస్యకు పరిష్కారంగా పిఆర్పి ఇంజక్షన్లను చేయించుకుంటున్నారు. మోకాళ్లలో కొలాజిన్ తగ్గిపోవడం వల్ల కీళ్ల మధ్య రాపిడి జరిగి లూబ్రికేట్ లేక మోకాలు నొప్పి వస్తుంది. కీళ్ల వద్ద వాపు రావడం, నడవలేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. ఇక ఈ సమస్యల పరిష్కారానికి వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించు కుంటున్నారు.క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పి ట్రీట్మెంట్ వర్కౌట్ అవుతుందాఅయితే మరికొందరు ఇంటి చిట్కాలను కూడా పాటిస్తున్నారు. మోకాలు నొప్పిని తగ్గించుకోవడానికి ప్రస్తుతం వైరల్ అవుతున్న ఇంటి చిట్కాలలో క్యాబేజీ ఆకులతో ప్యాక్ చేయడం ఒకటి. అసలు క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పి కోసం చేసే ట్రీట్మెంట్ వర్కౌట్ అవుతుందా వైద్యులు ఏం చెప్తున్నారు అనేది ఒకసారి తెలుసుకుందాం.క్యాబేజ్ ఆకులతో ప్యాక్ ఇలామోకాలు నొప్పి కోసం చాలామంది ఇంట్లోనే క్యాబేజీ ఆకులతో మోకాలికి ప్యాక్ వేస్తున్నారు. క్యాబేజీ ఆకులను తీసి, వాటిని మెత్తబడేలా బాగా రుద్ది ఆ పైన మోకాలి పైన ఆకులు పెట్టి, కాటన్ క్లాత్ తో కానీ, బ్యాండేజ్ తో కానీ కట్టు కట్టాలి. కనీసం అరగంట నుంచి గంట పాటు, లేదా రాత్రంతా అలానే దానిని ఉంచాలి.మోకాలు వాపు తగ్గించే క్యాబేజీ ఆకులురోజుకు ఒకసారి లేదా రెండుసార్లు ఇలా చేయడం వల్ల కొద్దిగా మోకాలు నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. క్యాబేజీ ఆకుల్లో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మోకాలు వాపు తగ్గించడంలోనూ, రక్త ప్రసరణ మెరుగుపరచటం లోను, మోకాలు స్టిఫ్నెస్ తగ్గించి, ఫ్రీగా నడవడానికి సహాయపడతాయి. అయితే క్యాబేజీ ఆకులతో మోకాలు నొప్పికి కలిగే ఉపశమనం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

అది మోకాలు నొప్పికి శాశ్వతమైన పరిష్కారం కాదు. కనుక ఆర్థరైటిస్ తో బాధపడేవారు నొప్పి కాస్త రిలీఫ్ కావాలంటే క్యాబేజీ ఆకులను ఉపయోగించవచ్చు కానీ, కచ్చితంగా వైద్యుని సంప్రదించ వలసిందే. ఇక కొంతమందికి క్యాబేజీ ఆకులతో అలర్జీ వచ్చే అవకాశం కూడా ఉంటుంది కాబట్టి, అటువంటి సమస్య ఉంటే క్యాబేజీ ఆకులతో కట్టుకట్టడం కూడా మంచిది కాదు

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026



# వరల్డ్‌కప్‌లో ఇటలీ తొలి విజయం



## - నేపాల్ పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ప్రపంచకప్‌లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో తొలి విజయం నమోదు చేసింది. తాజాగా ముంబయి వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది.స్వల్ప లక్ష్య ఛేదనే అయినప్పటికీ నేపాల్ ఏదైనా అద్భుతం చేస్తుందేమోనని క్రికెట్ ఫ్యాన్స్ తొలుత భావించారు. అయితే ప్రత్యర్థి నేపాల్‌కు ఇటలీ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి నుంచే ఎడాపెడా బౌండరీలు బాదేశారు. వీళ్లిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించిన ఓపెనర్లు చెరో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే 10 ఓవర్లకు స్కోర్ 97కు చేరింది. ఇక 11, 12వ ఓవర్లో వరుసగా 14, 11 వచ్చాయి. ఆ తర్వాత 13వ ఓవర్లో రెండు సింగిల్స్ రావడంతో మ్యాచ్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు) టాప్ స్కోరర్. రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. గతమ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన లోకేశ్ బమ్ (3 పరుగులు) తీవ్రంగా నిరాశపర్చాడు. చివర్లో కరణ్ కేసీ (18లి పరుగులు) బాదడంతో జట్టు స్కోర్ 120 దాటింది. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆ మ్యాచ్‌లో గెలుపు అంచులదాకా వెళ్లిన పసికూన నేపాల్, ఈసారి ఇటలీని చిత్తు చేస్తుందని మ్యాచ్‌కు ముందు అంతా అనుకున్నారు. కానీ సీన్స్ రివర్స్ అయ్యింది. తొలుత బ్యాటింగ్, తర్వాత బౌలింగ్ రెండు విభాగాల్లోనూ పూర్తిగా విఫలమై వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. ఇక ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది. అలాగే టీ20 ప్రపంచకప్‌లో 100 పరుగుల భాగస్వామ్యం చేసిన మూడో అసోసియేటెడ్ (టెస్టు హోదా లేని జట్టు) జట్టుగా ఇటలీ అరుదైన ఘనత సాధించింది. గతంలో ఒమన్ (2021), స్కాట్లాండ్ (2026) ఈ ఘనత సాధించాయి. వరల్డ్‌కప్‌లో తొలి విజయం సాధించిన ఇటలీని క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ అభినందించాడు. “టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయం అందుకున్న ఇటలీకి శుభాకాంక్షలు. ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ జట్టైన ఇటలీ క్రికెట్‌లోనూ తనదైన ముద్ర వేయడం, గ్లోబల్ లెవెల్‌కు వ్యాపిస్తుందని గుర్తుచేస్తుంది” అని సచిన్ ట్వీట్ చేశాడు.



# పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మ దూరం

టీ20 ప్రపంచ కప్ 2026 భారత్ తన రెండో మ్యాచ్ ఆడుతోంది. మొదటి మ్యాచ్‌లో అమెరికాపై విజయం సాధించింది. ఇప్పుడు రెండో మ్యాచ్ నమీబియాతో తలపడుతోంది. మొదటి మ్యాచ్‌లో తొలి బంతికే అవుట్ అయిన అభిషేక్ శర్మ ఆరోగ్యం ఇప్పుడు టీమిండియాను టెన్షన్ పెడుతోంది. అభిషేక్ కడుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఇప్పుడు, నమీబియాతో జరిగే రెండో మ్యాచ్ కోసం అభిషేక్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కలేదు. మ్యాచ్‌కు ముందు టాస్ సందర్భంగా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభిషేక్ శర్మ ఆరోగ్యం గురించి అప్‌డేట్ ఇచ్చాడు. సూర్య అప్‌డేట్ అభిమానులకు నిజంగా షాక్‌కి గురి చేసింది. పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ కూడా దూరంగా ఉండవచ్చని అతను చెప్పడం ఆందోళనకలిగిస్తోంది. టాస్ తర్వాత అభిషేక్ ఆరోగ్యం గురించి అడిగిన ప్రశ్నకు సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, “అభిషేక్ ఇంకా బాగా లేదు. అతను ఒకటి లేదా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడు” అని అన్నారు. సూర్య ప్రకటన స్పష్టంగా అర్థం ఏమిటంటే, నమీబియా తర్వాత, పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు కూడా అభిషేక్ దూరమవవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15 ఆదివారం శ్రీలంకలోని కొలంబోలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి వస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. టోర్నమెంట్‌లో భారత్ ప్రధాన ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ. అతని స్థానంలో ఓపెనింగ్ వస్తున్న సంజూ శాంసన్ ఫామ్‌లో లేడు. ఆయన ధాటిగా ఆడటానికి పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. అయితే, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ విఫలమయ్యాడు. ఖాతా తెరవకుండానే మొదటి బంతికే ఔటయ్యాడు. అయినప్పటికీ, పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ ఉండటం టీమ్ ఇండియాకు పెద్ద ప్రయోజనకరంగా ఉంటుంది.

# హార్దిక్ పాండ్యా రికార్డుకు గురిపెట్టిన వైభవ్ సూర్యవంశీ..



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే క్రికెట్ అభిమానులకు అసలైన మజా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఒకప్పుడు హార్దిక్ పాండ్యా ఒకే ఇన్నింగ్స్‌లో 20 సిక్సర్లు బాది సృష్టించిన సునామీ గుర్తు ఉండే ఉంటుంది. ఇప్పుడు అదే టోర్నమెంట్‌లో ఈ చిచ్చరపిడుగు తన ప్రతాపం చూపించబోతున్నాడు. ఫిబ్రవరి 23 నుంచి ముంబైలో ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్‌లో వైభవ్ ఆడటం దాదాపు ఖాయమైంది. డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్ అంటేనే స్టార్ ప్లేయర్లకు అడ్డా. 2020లో గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యా ఇదే టోర్నీలో విశ్వరూపం చూపించాడు. కేవలం 55 బంతుల్లో 20 సిక్సర్లు, 6 ఫోర్లతో 158 పరుగులు చేసి క్రికెట్ లోకాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీలు బాదిన పాండ్యా, అప్పట్లో ఈ టోర్నీ స్థాయిని అమాంతం పెంచేశాడు. ఇప్పుడు అదే వేదికపై వైభవ్ సూర్యవంశీ తన సత్తా చాటబోతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోవడానికి బలమైన కారణం ఉంది. ఇటీవల ముగిసిన అండర్-19 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు బాది సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ఇప్పటికే అండర్-19 క్రికెట్‌లో రెండు సెంచరీలు సాధించిన వైభవ్, ఇప్పుడు సీనియర్ ప్లేయర్లతో తలపడేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడనున్న వైభవ్, దానికి ముందు ఈ టోర్నీని ఒక వార్మప్ సెషన్‌గా భావిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం.. వైభవ్ ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ ఆధ్వర్యంలో తాళేగావ్‌లో జరుగుతున్న శిక్షణా శిబిరంలో ఉన్నాడు. ఈ క్యాంప్ ఫిబ్రవరి 21న ముగియనుంది. ఆ తర్వాత తన స్వస్థలానికి వెళ్లి, తిరిగి ముంబై చేరుకుని డీవై పాటిల్ టోర్నీలో పాల్గొంటాడు.

## ● షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు వైరల్‌గా మారిన ట్వీట్

# భారత క్రికెటర్ల వాచ్‌ల విలువ కాదు పాక్ ఆటగాళ్ల నెట్‌వర్త్..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌పై నెలకొన్న సందిగ్ధతకు ఐసీసీ తెరదించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్.. ఐసీసీ ఆంక్షలకు తలొగ్గి తమ నిర్ణయాన్ని మార్చుకుంది. భద్రతా కారణాలతో టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోమని ఐసీసీ హామీ ఇవ్వడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ సిద్ధమైంది.భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా పీసీబీ డిమాండ్ చేయగా.. ఐసీసీ తిరస్కరించింది. తమ పరిధిలో లేని వ్యవహారమని, బీసీసీఐని ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడమని ఆదేశించలేమని స్పష్టం చేసింది. మిత్ర దేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో బాయ్‌కట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.దాంతో ఆదివారం(ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. పాకిస్థాన్ బాయ్‌కాట్ డ్రామా నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండటం.. పాకిస్థాన్‌లో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం ఈ మ్యాచ్‌పై హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీక్ అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సోషల్ మీడియా వేదికగా జోరుగా చర్చ జరుగుతోంది.అయితే ఈ చర్చ మధ్యలో కొన్ని ఫేక్ ట్వీట్స్, కామెంట్స్ కూడా నెటిజన్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. భారత్‌తో పాకిస్థాన్ జట్టును పోల్చడం సరికాదని, భారత ఆటగాళ్ల వాచీల ధర అంత కూడా పాక్ ఆటగాళ్ల సంపాదన ఉండదని షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది.భారత ఆటగాళ్లతో పాకిస్థాన్ ప్లేయర్లను అస్సలు పోల్చలేరు. మా క్రికెటర్ల నెట్‌వర్త్ భారత ఆటగాళ్లు వాడే ఖరీదైన వాచులతో సమానం.'అని షోయబ్ అక్తర్.. ఓ ప్రముఖ భారత న్యూస్ ఛానెల్‌తో అన్నట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. ఈ కామెంట్స్‌ను అక్తర్ ఎక్కడా అనలేదు. పాకిస్థాన్‌పై ఉన్న కోపంతో ఓ భారత నెటిజన్ క్రియేట్ చేసిన పోస్ట్ అని ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎక్స్ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఇది నకిలీ పోస్ట్ అని తేల్చింది. మెగా టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. ఆసియా కప్ 2025 టోర్నీలో మూడు మ్యాచ్‌లకు మూడింటిలోనూ భారత్‌పై పాకిస్థాన్ ఓటమిపాలైంది.



# సూపర్-8 రేసులో వెనుకబడ్డ ఇంగ్లాండ్




టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టిక తలకిందులవుతోంది. ఫిబ్రవరి 11న జరిగిన కీలక పోరులో వెస్టిండీస్ చేతిలో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో సూపర్-8 ఈక్వేషన్స్ పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్లుగా వెలిగిన ఇంగ్లాండ్ టీమ్, ఇప్పుడు తదుపరి రౌండ్‌కు చేరుతుందా లేదా అన్న ఆందోళనలో పడిపోయింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన వెస్టిండీస్ 4 పాయింట్లతో గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచి, ఒకటి ఓడిపోయినప్పటికీ.. రన్ రేట్ తక్కువగా ఉండటంతో స్కాట్లాండ్ కంటే వెనుకబడి మూడో స్థానంలో ఉంది.

# 6,6,6,6,6.. 20 బంతుల్లో ఇషాన్ బీభత్సం..

టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్, తొలి ఆరు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. తుఫాన్ ఆరంభంతో నమీబియాపై చెలరేగిపోయారు టీమిండియా బ్యాటర్లు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ మరోసారి తన బ్యాట్ ఝులిపించాడు. కేవలం 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 6 ఫోర్లు ఉన్నాయి. ధాటిగే ఆడే క్రమంలో ఓ భారీ షాక్ ఆడబోయి 61 పరుగులకు పెవిలియన్ చేరాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో ఇషాన్ వరుసగా నాలుగు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టి తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. శాంసన్ 22 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఈ క్రమంలో ఇషాన్‌తోపాటు టీమిండియా పేరిట కొన్ని రికార్డులు నమోదయ్యాయి.



## యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.



## 'యుఫోరియా'పై మహేశ్ బాబు ప్రశంసలు... క్లైమాక్స్ అద్భుతమన్న సూపర్ స్టార్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'యుఫోరియా'పై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సినిమాను వీక్షించిన ఆయన, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది."గుణశేఖర్ గారు కథలను చెప్పే విధానంలో ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది. సినిమాను నేను బాగా ఆస్వాదించాను, ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా ఉంది. ఇది తప్పక చూడాల్సిన సినిమా" అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దర్శకుడు గుణశేఖర్‌తో పాటు నటి భూమికా చావ్లా, నిర్మాతలు నీలిమ గుణ, యుక్త గుణ, సంగీత దర్శకుడు కాల భైరవ, నటి సారా అర్జున్ సహా మొత్తం చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక అంశాలతో కూడిన డ్రామా థ్రిల్లర్‌గా 'యుఫోరియా' తెరకెక్కింది. యువత ఎదుర్కొంటున్న డ్రగ్స్, నేరాలు, కుటుంబ సమస్యల వంటి సున్నితమైన అంశాలను ఈ చిత్రంలో చర్చించారు. భూమికా చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి స్పందన లభిస్తోంది.మహేశ్ బాబు కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఒక్కడు' చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఈ నేపథ్యంలో మహేశ్ నుంచి వచ్చిన ప్రశంసలు 'యుఫోరియా' చిత్ర బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్



స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

----------




## సుహాస్ వైవిధ్యంగా హే భగవాన్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించడమే కాకుండా, ÷-లకైమాక్స్‌లో ఒక మంచి ఎమోషనల్ టచ్ కూడా ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించగా, బన్నీ వాస్ మరియు వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు.

## అప్పలసూరిగా జగపతిబాబు

ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు.




## బాలీవుడ్‌లో బెదిరింపుల కలకలం..

### రణ్‌వీర్, ఆయుష్ శర్మలకు హెచ్చరికలు



బాలీవుడ్‌లో మరోసారి బెదిరింపుల కలకలం రేగింది. ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్‌తో పాటు, సల్మాన్ ఖాన్ బావమరిది, నటుడు ఆయుష్ శర్మలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు అందాయి. కోట్లాది రూపాయలు డిమాండ్ చేస్తూ వచ్చిన ఈ హెచ్చరికలతో సినీ పరిశ్రమ ఉలిక్కిపడింది. ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తును ముమ్మరం చేశారు.రణ్‌వీర్ సింగ్‌కు చెందిన ఒక ఉద్యోగి వాట్సాప్‌కు వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు సందేశం వచ్చింది. నిందితులు తమ ఆచూకీ తెలియకుండా ఉండేందుకు వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) వాడినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు, ఆయుష్ శర్మకు అత్యంత గోప్యత కలిగిన ప్రోటాన్‌మెయిల్ ద్వారా బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. క్రిప్టోకరెన్సీ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలని అందులో డిమాండ్ చేశారు. ఈ ఘటనల నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.ఇటీవల దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి వద్ద జరిగిన కాల్పుల ఘటన తర్వాత బాలీవుడ్ ప్రముఖులే లక్ష్యంగా ఈ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. రోహిత్ శెట్టి కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసి, వారిపై కఠినమైన 'మకోకా' చట్టాన్ని ప్రయోగించారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com